

మరో ముగ్గురికి డైరెక్టర్ పదవులు

అనంతపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ముగ్గురు టీడీపీ నాయకులకు కార్పొరేషన్ డైరెక్టర్లుగా అవకాశం దక్కింది. ఈ మేరకు మంగళవారం ప్రభుత్వం జాబితాను విడుదల చేసింది. యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్‌గా గుంతకల్లు నియోజకవర్గానికి చెందిన మస్తాన్‌యాదవ్ నియమితుడయ్యారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్‌గా తాడిపత్రికి చెందిన కమలమ్మ, గిరిజన కో-ఆపరేటివ్ కార్పొరేషన్ రాష్ట్ర సభ్యుడిగా గుంతకల్లుకు చెందిన రమేష్ నాయక్‌ను నియమించారు.



మహిళాశక్తి అనన్యం
- దేశాన్ని మార్చగల సామర్థ్యం అతివల సొంతం
- తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ నంద

ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

6



సీపీఐ మహిళా సమాఖ్య నేత మృతి
పార్టీ శ్రేణుల దిగ్భ్రాంతి..
నేడు మెడికల్ కళాశాలకు భౌతికకాయం

6



సదా ప్రజాసేవలో...!
సమాజ సేవకు శ్రమిస్తున్న బద్దేనాయక్
ఆపన్నులు, పేదలకు ఆర్థికసాయం
పదేళ్లలో రూ.కోటికిపైగా...
హిందీ టీచర్‌పై సర్వత్రా ప్రశంసలు


7

ఐటీ సెల్‌లో అనకొండ



డీఈఓ ఆఫీస్

డీఈఓ కార్యాలయంలో హవా
- విధులకు రాడు.. వస్తే ఉండడు..!
- 'కలెక్టర్ పిలుస్తున్నారు..' అని మస్కా
- బదిలీలు.. సర్దుబాట్లలో భారీగా అక్రమాలు
- ఐదుగురు డీఈఓలు మారినా.. అదే పరిస్థితి



ఐటీ సెల్

ఆయన విధులకు రానే రారు. ఒక వేళ రావాలనుకుంటే.. ఉదయం పదిన్నర లేదా.. 11 గంటలకు వస్తాడు. ఐటీ సెల్‌లో ఇలా కూర్చుని అలా వెళ్తాడు. ఎవరైనా ఎక్కడికని అడిగితే.. 'అర్జంటుగా కలెక్టర్ గారు పిలిచారు..' అని చెబుతాడు. ఆఫీస్ బయటకు వచ్చి, ఒక దమ్ము లాగేస్తాడు. ఇక అంతే..! మధ్యాహ్నం వస్తే వస్తాడు.. లేకపోతే లేదు. మళ్లీ సాయంత్రం ఎంట్రీ ఇస్తాడు. ఇప్పటికి ఐదుగురు డీఈఓలు మారినా.. ఆయనను ఏం చేయలేకపోయారంటే.. ఆయన హవా ఏమిటో అర్థం చేసుకోవచ్చు. బదిలీలు, సర్దుబాట్లలో ఆయన చేయి తడిపిన తీరును చూస్తే.. ముక్కున వేలేసుకోవాల్సిందే. ఆయన ఒక ఉపాధ్యాయుడు. ఎందరో ఉపాధ్యాయులను మింగిన అనకొండ.! ఐటీ సెల్‌లోని అనకొండ అవినీతి బాగోతంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసేందుకు పలువురు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సిద్ధమయ్యారు.

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): చిన్న చేపలను పెద్ద చేపలు తింటాయి. ప్రకృతి ధర్మం అది. కానీ గురువులను మింగుతున్నాడు మరో గురువు. అయినవాళ్ల కోసం అడ్డంగా అయ్యవార్లను ముంచేస్తున్నాడు. కథ. ఉపాధ్యాయుల బదిలీల్లో, సర్దుబాట్లలో కనీవినీ ఎరుగని మాయ చేస్తుంటారు. తన అనుకున్నవారికి, చేయి తడిపినవారికి ఎన్నోమార్లు లబ్ధి చేకూర్చాడు. 2022-2023 బదిలీల్లో అదనపు పాయింట్లకు రూ.50 వేలు, ఆపైన వసూలు చేసి.. కొందరిని భారీగా ప్రయోజనం చేకూర్చాడు. వందలాది మందికి అన్యాయం చేశాడు. మరీ ముఖ్యంగా టీచర్ల సర్దుబాటులో తనకు అయినవారైన సర్‌ప్లస్ టీచర్లను సైతం సర్‌ప్లస్ కాదని చూపించి.. అయాచిత లబ్ధి చేకూర్చాడు. సర్దుబాటులో సైతం అర్హులైన ఎందరో టీచర్లను ముంచేశాడు. ఒక వైపు 10వ తరగతి విద్యార్థులకు బోధించే సబ్జెక్టు టీచర్ల లేక ఇబ్బందులు పడుతుంటే.. వారి భవిష్యత్తు పట్టకుండా అయినోళ్లకు కోసం అనేక అక్రమాలు చేశాడు. ఎంత తవ్వితే అంత అవినీతి, అన్ని అక్రమాలు బయట పడుతున్నాయి. దీంతో ఆయన వ్యవహారంపై ఫిర్యాదు చేసేందుకు కొందరు ఉపాధ్యాయ సంఘాల నేతలు సిద్ధమయ్యారు. ఐదుగురు డీఈఓలు మారినా ఆయన అక్రమాలపై ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. మాటలతో అంతలా మాయ చేయగలడు మాస్టారు. 'కలెక్టర్ బాగా తెలుసు, ఐఏఎస్, ఐఆర్‌ఎస్‌లు తెలుసు' అని డీఈఓలకు చెబుతుంటాడు. పరోక్షంగా భయపెడుతుంటాడు. దీంతో ఎందుకొచ్చిన గొడవ అని డీఈఓలు చూసీచూడనట్లు వ్యవహరించారు. ఇదే అదనుగా ఆయన పబ్బం గుడుపుకుంటున్నారు. విద్యాశాఖలో ఎవరిని కదిలించినా ఆయన గురించి గుక్క తిప్పుకోకుండా చెబుతుంటారు. కార్యాలయం లోపల, బయట ఆయన గురించి బహిరంగ చర్చ నడుస్తుంటుంది.

బదిలీల్లో పాయింట్లకు లెక్కలు

2022-23 ఉపాధ్యాయ బదిలీల్లోనూ అనకొండ మాస్టారు భారీగానే చేతివాటం ప్రదర్శించాడనే ఆరోపణలు ఉన్నాయి. ఉపాధ్యాయ బదిలీ ప్రక్రియలో చివరగా డీఈఓ కార్యాలయంలో ఎడిట్ ఆప్షన్ ఉటుంది. ఏదైనా తప్పు జరిగి ఉంటే.. ఉపాధ్యాయులు చివరల్లో సరిచేసుకోవచ్చు. దీన్ని అవకాశంగా తీసుకున్న అనకొండ మాస్టారు.. అయినవారికి ఎడాపెడా పాయింట్లు ఇచ్చేశాడు. ఒక్కో టీచర్ నుంచి రూ.50వేలు, ఆపైన వసూలు చేశాడు. ఇలా రూ.లక్షలు చేతులు మారాయి. చాలా మండలాల నుంచి ఎంఈఓలు పంపిన టీచర్ల పాయింట్లకు, డీఈఓ కార్యాలయంలో నమోదైన పాయింట్లకు తేడాలు కనిపించాయి. తాడిపత్రి నియోజకవర్గంలోని ఓ మండల విద్యాశాఖాధికారి తన మండంలోని టీచర్ల వివరాలు ఇస్తే.. చివరలో తారుమారయ్యాయి. అనకొండ టీచర్ తనకు కావాల్సిన నలుగురు టీచర్ల పాయింట్లను అమాంతం పెంచేసి, బదిలీల్లో ఎక్కువ పాయింట్లు వచ్చేలా చేశారు. ఈ విషయం తెలుసుకున్న తాడిపత్రి నియోజకవ వర్గంలోని ఓ ఎంఈఓ గొడవ పడినట్లు తెలిసింది.

అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు.. ఈ కింద పేర్కొన్న టీచర్లను సర్‌ప్లస్ కాకుండా చూపారన్న ఆరోపణలు వస్తున్నాయి.

స్కూల్ అసిస్టెంట్	మండలం	సబ్జెక్టు	స్కూల్
ఉపాధ్యాయుడు	శింగనమల	ఇంగ్లిష్	జడ్పీ హైస్కూల్, శింగనమల
ఉపాధ్యాయిని	పుట్లూరు	ఇంగ్లిష్	జడ్పీ హైస్కూల్, పుట్లూరు
ఉపాధ్యాయిని	శింగనమల	ఇంగ్లిష్	జడ్పీ హైస్కూల్, తరిమెల
ఉపాధ్యాయుడు	యల్లనూరు	సోషల్	ఎంపీయూపీ స్కూల్, కల్లూరు
ఉపాధ్యాయిని	శింగనమల	సోషల్	జడ్పీ హైస్కూల్, తరిమెల

కలెక్టర్ పేరు వాడేయటమే..

ఐటీ సెల్‌లో పనిచేసే అనకొండ టీచర్ వ్యవహారం నిత్యం వివాదాస్పదం అవుతోంది. డీఈఓ ఆఫీస్ ఐటీ సెల్‌లో ఉండాల్సిన ఆయన.. గంటపాటు కూడా అక్కడ కనిపించడు. దీని గురించి డీఈఓలు అడిగితే.. 'సార్... కలెక్టర్ నుంచి ఫోన్ వచ్చింది. డీఈఓ ఆఫీస్ నుంచి ఎవరో ఒకరు వెంటనే రావాలని అంటున్నారు' అని చెప్పి మస్కా కొడతాడు. కలెక్టర్ పేరు చెబితే ఎవరూ ఆపరని ఆయన ధీమా. రెండు మూడేళ్లుగా ఆయన ఇదే డ్రామా నడిపిస్తున్నాడని డీఈఓ కార్యాలయ, సమగ్రశిక్ష ప్రాజెక్టు సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. కలెక్టర్‌కు అవసరమైతే ఏ శాఖ నుంచైనా ఆ శాఖాధిపతిని పిలిపిస్తారు. డీఈఓ ఆఫీస్ విషయాల గురించి అయితే.. నేరుగా డీఈఓనే పిలుస్తారు. ఇక్కడ మాత్రం డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఏడీలు, సూపరింటెండెంట్లను కాదని.. అనకొండ మాస్టారును పిలుస్తుంటారట..! గడిచిన మూడేళ్లలో శామ్యూల్, వెంకటకృష్ణారెడ్డి, సాయిరాం, నాగరాజు, వరలక్ష్మి.. ఇలా ఐదుగురు డీఈఓలు పనిచేసి వెళ్లారు. తాజాగా ఆరో డీఈఓ వచ్చారు. ఇప్పుడైనా పరిస్థితిలో మార్పు వస్తుందా..? రాదా..? అనే చర్చ జరుగుతోంది. అనకొండ టీచర్ డామినేషన్, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు, విద్యాశాఖ అధికారులు కోరుతున్నారు. టీచర్ల సర్దుబాటు, బదిలీల్లో అక్రమాల గురించి విచారణ చేయిస్తే.. అనకొండ గుట్టు రట్టు అవుతుందని అంటున్నారు.



సర్దుబాటులో చేతివాటం

విద్యాశాఖలో ఐటీ సెల్ కీలకం. ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాలల సమగ్ర వివరాలు ఐటీ సెల్‌లో పనిచేసే టీచర్ల వద్దే ఉంటాయి. ఉపాధ్యాయుల బదిలీలు, సర్దుబాట్లలో ఈ సెల్‌లో పనిచేసేవారు అందించే సమాచారం అత్యంత కీలకంగా పనిచేస్తుంది. ఇదే అదునుగా ఉపాధ్యాయుల సర్దుబాటును తనకు అనకూలంగా మార్చుకుని.. దందాకు తెరలేపారు ఆయన. ఉపాధ్యాయులను కదిలించేందుకు, అక్రమ వసూళ్లకు ఐటీ సెల్‌ను అడ్డాగా మార్చాడు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సర్దుబాటులో భారీగా గోల్ మాల్ చేశాడు. 2024 టీచర్ల సర్దుబాటులో కనీవినీ ఎరుగని అక్రమాలు చేశాడు. గతంలో ఇంగ్లిష్ స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు లేవు. చాలా మంది ఇంగ్లిష్ టీచర్లు ఉద్యోగోన్నతులు కావాలని కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఇటీవలి సర్దుబాటులో భారీగా ఇంగ్లిష్, సోషల్ స్కూల్ అసిస్టెంట్ల సర్దుబాటులో సర్‌ప్లస్ టీచర్లను సైతం సర్‌ప్లస్ టీచర్లు కాదని చూపించి మినహాయింపు ఇచ్చినట్లు సమాచారం.

ప్రాంతాల మధ్య చిచ్చుకు వైసీపీ కుట్ర

ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు



అనంతపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టి పబ్బం గడుపుకోవడానికి వైసీపీ నాయకులు సరికొత్త రాజకీయ కుట్రలకు తెరలేపుతున్నారని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ధ్వజమెత్తారు. అసెంబ్లీలో సాగునీటి ప్రాజెక్టులపై మంగళవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. రాయలసీమ వైసీపీ నాయకులు ఇటీవల చేస్తున్న ప్రకటనలు అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉన్నాయని అన్నారు. రాయలసీమకు నీరు ఇవ్వాలని మొదట సంకల్పించిన నాయకుడు ఎన్టీఆర్ అని అన్నారు. హంద్రీనీవా ద్వారా 40 టీఎంసీలు రాయలసీమకు, జీఎన్‌ఎస్‌ఎస్ ద్వారా కర్నూలు, కడప జిల్లాలకు మరో 40 టీఎంసీలు ఇవ్వాలని అప్పట్లోనే ప్రతిపాదించారని అన్నారు. రాయలసీమ ప్రాజెక్టుల పునరుజ్జీవం కోసం కృషి చేసిన నాయకుడు చంద్రబాబు అని అన్నారు. మిగులు జలాల ఆధారంగా నిర్మితమవుతున్న ఏపీ ప్రాజెక్టులకు నీటి కేటాయింపులను కోరబోమని బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు 2005లో వైఎస్సార్ లేఖ రాశారని, ఉమ్మడి ఏపీలోని అత్యంత కరువు పీడిత ప్రాంతాలకు తీరని అన్యాయం చేశారని అన్నారు. రాయలసీమ దుర్భిక్ష నివారణ పథకం పేరుతో జగన్ హంగామా చేశారని అన్నారు. పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని 80 వేల క్యూసెక్కులకు పెంచి రాయలసీమను సస్యశ్యామలం చేస్తానని గొప్పలు చెప్పారని ఎద్దేవా చేశారు. అరకొరగా అందుతున్న జలాలనూ జగన్ అత్యంత వివాదాస్పదంగా మార్చారని మండిపడ్డారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్, తెలంగాణ వాసులు శ్రీశైలం నుంచి ఎక్కువ నీటిని వాడుతున్నారనే అపోహను జగన్ కల్పించారని అన్నారు. బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం కర్ణాటక, మహరాష్ట్ర కంటే ఏపీకి ఎక్కువగా నీటి కేటాయింపులు జరిగాయని అన్నారు. సీఎం చంద్రబాబు భావితరాలకు నీటి కష్టాలు రాకుండా అవిశ్రాంతంగా కష్టపడుతున్నారని అన్నారు. వృథాగా సముద్రంలో కలుస్తున్న గోదావరి జలాలను సద్వినియోగం చేసుకునేందుకు గోదావరి, కృష్ణ, పెన్నా అనుసంధానానికి చంద్రబాబు శ్రీకారం చుట్టారని అన్నారు.

పేరూరు ప్రాజెక్టుకు నీరివ్వండి

పనులను వెంటనే ప్రారంభించండి
పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 53 చెరువులకు కూడా..
అసెంబ్లీలో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



అనంతపురం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పేరూరు ప్రాజెక్టుకు నీరందించే పనులను వెంటనే ప్రారంభించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రభుత్వాన్ని కోరారు. పీఏబీఆర్ కుడికాలువ ద్వారా 53 చెరువులకు నీరందించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేరూరు ప్రాజెక్టుతో పాటు పీఏబీఆర్ పరిధిలోని రైతులు పడుతున్న ఇబ్బందులకు పరిష్కారం చూపాలన్నారు. పెన్నానదిపై 66 ఏళ్ల క్రితం పేరూరు ప్రాజెక్టు నిర్మించారన్నారు. ఆ రోజుల్లోనే 1.08 టీఎంసీల కెపాసిటీతో, రూ. 69 లక్షలతో రిజర్వాయర్ నిర్మించారని గుర్తు చేశారు. రిజర్వాయర్ నిర్మించి 66 ఏళ్లయినా ఇప్పటి వరకూ 16 సార్లు కూడా పూర్తి స్థాయిలో నీరు రాలేదన్నారు. 2012లో చంద్రబాబు పాదయాత్ర చేసిన సమయంలో పేరూరు ప్రాజెక్టుకు హంద్రీనీవా జలాలు ఇస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. రూ. 804 కోట్లతో హంద్రీనీవా నుంచి పేరూరు ప్రాజెక్టుకు నీరందించే విధంగా చర్యలు చేపట్టారన్నారు. ఇందుకోసం 54 కి.మీ మేర కాలువ, నాలుగు లిఫ్ట్ ఇరిగేషన్లు, సోమరవాండ్లపల్లి, పుట్ట కనుమ రిజర్వాయర్లు నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. ఇందుకోసం రెండు వేల ఎకరాల భూమి కూడా సేకరించేందుకు చర్యలు చేపట్టారన్నారు. రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వెయ్యి ఎకరాలు ఇచ్చారన్నారు. ఇందులో 95 ఎకరాలకుగానూ రూ. 5 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి చేతకానితనంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. ప్రతిపాదించిన ప్రాజెక్టులు నిర్మించకుండా కొత్త డిజైన్లు తీసుకొచ్చారని తెలిపారు. కనీసం ఒక్క ఎకరా భూమి కూడా సేకరించలేదని విమర్శించారు. వర్షం వల్ల ప్రాజెక్టుకు నీరు చేరితే దిగువ ప్రాంతాలకు విడుదల చేసేందుకు గేట్లను ఎత్తే క్రమంలో మూడు గేట్లు విరగ్గొట్టారని.. దీంతో నీరంతా ఏటిపాలైందన్నారు. పేరూరు ప్రాజెక్టుకు నీరు వస్తుందన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారని తెలిపారు. ప్రస్తుత ధర మేరకు భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మరో వైపు పీఏబీఆర్ కుడికాలువ ద్వారా అనంతపురం జిల్లాలో 29 చెరువులు, శ్రీ సత్యసాయి జిల్లాలో 24 చెరువులు మొత్తం ఉమ్మడి జిల్లాలో 53 చెరువులకు నీరందించాలని కోరారు. కరువు జిల్లా రైతాంగాన్ని దృష్టిలో ఉంచుకొని 5 నుంచి 7 టీఎంసీలు నీటిని పీఏబీఆర్ కుడికాలువకు విడుదల చేసేందుకు చర్యలు తీసుకోవాలని పరిటాల సునీత ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని, ఉక్కు మహిళ ఇందిరా గాంధీ 107వ జయంతి సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఘన నివాళులు అర్పించారు. డీసీసీ కార్యాలయంలో అర్బన్ నియోజకవర్గ ఇన్‌చార్జి దాదాగాంధీ ఆధ్వర్యంలో ఇందిర గాంధీ విగ్రహానికి మంగళవారం పూల మాలలు వేసి నివాళి అర్పించారు. బ్యాంకుల జాతీయం, హరిత విప్లవం ద్వారా దేశ ప్రగతికి పాటుపడిన గొప్ప నాయకురాలు ఇందిరా గాంధీ అని నాయకులు కొనియాడారు. గరీబీ హటావో నినాదంతో పేదల సంక్షేమం కోసం ఆమె ఎంతగానో కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వాసు, ఇంతియాజ్, బాషా, కృష్ణ, హరి, హనీఫ్, చంద్రశేఖర్‌రెడ్డి, నిశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాఠీపై వేటు

అవినీతి ఆరోపణలతో వీఆర్‌కు 15 మంది..
నలుగురు ఏఎస్‌ఐలు, ఆరుగురు హెచ్‌సీలు, ఐదుగురు కానిస్టేబుళ్లు

వివరాలు 7లో

దేశ నిర్మాణంలో యువతే కీలకం: కలెక్టర్



యువ ఉత్సవ్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత నిర్మాణంలో యువత పాత్ర కీలకమని, యువత భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జేఎన్‌టీయూ ఆడిటోరియంలో మంగళవారం జిల్లాస్థాయి యువ ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రపంచంలోనే అత్యధిక శాతం యువత మన దేశంలో ఉందని అన్నారు. యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని అన్నారు. ప్రతి ఒక్కరూ డైరీ రాయడం అలవర్చుకోవాలని, స్వశక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలని సూచించారు. జిల్లాస్థాయి ఉత్సవ్ వర్సిటీలో నిర్వహించడం శుభపరిణామమని, జిల్లాస్థాయి విజేతలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఇన్‌చార్జి వీసీ సుదర్శన్‌రావు అన్నారు. వేడుకలలో యువత కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విజేతలకు అతిథులు బహుమతులను ప్రదానం చేశారు. జేఎన్‌టీయూ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి మణికంఠ, జాతీయ యువజన అవార్డు గ్రహీత బిసాటి భరత్, ఎన్‌వైకే అధికారి శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కార్యదర్శి మోహన్‌కృష్ణ, డాక్టర్ గరుగు బాలాజీ, మైగవర్నమెంట్ ప్రతినిధులు నాగేంద్ర, అమరేష్, నవని, కల్పన తదితరులు పాల్గొన్నారు.

మహిళాశక్తి అనన్యం

తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద
ప్రశాంతి నిలయంలో ఘనంగా మహిళా దినోత్సవం

దేశాన్ని మార్చగల సామర్థ్యం అతివల సొంతం



మహిళా దినోత్సవానికి హాజరైన భక్తులు

పుట్టపర్తి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): మహిళాశక్తి అనన్యమని తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ సూర్యపల్లి నంద అన్నారు. సత్యసాయి జయంత్యుత్సవాల రెండోరోజు మంగళవారం మహిళా దినోత్సవాలను ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపంలో అట్టహాసంగా నిర్వహించారు. అనంతపురం మహిళా క్యాంపస్ విద్యార్థినులు మంగళవాయిద్యాలు, బ్యాండ్ మేళంతో పూర్ణకుంభాన్ని సాయి కుల్వంత్ మందిరానికి తీసుకొచ్చారు. హైకోర్టు జడ్జి జ్యోతి ప్రజ్వలన చేసి, వేడుకలను ప్రారంభించారు. విద్యార్థినులు వేదపఠనం చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న హైకోర్టు జడ్జి ప్రసంగిస్తూ.. సత్యసాయి అందిస్తున్న విద్య, వైద్యం, తాగునీరు తదితర సేవలు వెలకట్టలేనివన్నారు. ఆధ్యాత్మిక విద్య, బోధనలు మానవాళిని శాంతి జీవనం వైపు ప్రయాణించేలా చేస్తున్నాయన్నారు. వేలాది మంది మహిళలు ఆధ్యాత్మిక, విలువలతో కూడిన విద్యను బోధిస్తుండడం హర్షణీయమన్నారు. పిల్లల పెంపకంలో తల్లి పాత్ర చాలా విశిష్టమైనదన్నారు. దేశాన్ని మార్చగల శక్తి మహిళకు ఉందన్నారు. ఎందరో మహిళలు దేశంలో ఉన్నత పదవులు అధిరోహించారనీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, నాటి ప్రధాని ఇందిరాగాంధీ ఆ కోవలోకి వస్తారన్నారు. భారతీయ సంస్కృతిలో మహిళలకు ప్రత్యేక గౌరవం ఉందని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు.

ప్రపంచ దేశాలకు మన సంస్కృతి ఆదర్శంగా నిలుస్తుందన్నారు. అనంతరం విద్యార్థినులు భక్తిగీతాలు ఆలపించారు. జడ్జిని ట్రస్టు ప్రతినిధులు సన్మానించారు. సాయంత్రం ప్రియా సిస్టర్స్ సంగీత కచేరి నిర్వహించారు. హయ్యర్ సెకండరీ పాఠశాల విద్యార్థినులు సాయి అమృతధార చరిత పేరిట ప్రదర్శించిన నాటిక భక్తులను అలరించింది. వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్జే రత్నాకర్, సభ్యులు నాగానంద, సత్యసాయి సేవాసంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



సత్యసాయి మహా సమాధికి నమస్కరిస్తున్న జస్టిస్ నంద



జస్టిస్ సూర్యపల్లి నందకు స్వాగతం పలుకుతున్న రత్నాకర్



ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి



బ్యాండ్ వాయిస్తున్న విద్యార్థినులు



పూర్ణకుంభంతో ర్యాలీగా వస్తున్న విద్యార్థినులు

విద్యుత్ భారాలను ఉపసంహరించుకోవాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్



మాట్లాడుతున్న రాంభూపాల్

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాల ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు చేసిన ప్రతిపాదన వల్ల వినియోగదారులపై రూ.11,820 కోట్ల భారం పడుతోందన్నారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో వినియోగించుకున్న విద్యుత్‌పై ప్రతి నెలా యూనిట్‌కు అదనంగా 50 పైసల నుంచి రూ.2.50 పైసల వరకు భారం పడుతోందన్నారు. విద్యుత్ భారాలు వేయబోమని ఎన్నికల ముందు కూటమి నేతలు ఇచ్చిన హామీకి విరుద్ధంగా భారాలు మోపడం సరికాదన్నారు. విద్యుత్ కంపెనీలు చేసిన ప్రతిపాదనలను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేయడానికి ప్రయత్నించిన స్మార్ట్ మీటర్లను విమర్శించిన అప్పటి ప్రతిపక్షంలోని టీడీపీ కూటమి నేతలు నేడు అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని విమర్శించారు.

డిసెంబరు 23, 24 తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలు

డిసెంబరు 23, 24వ తేదీల్లో సీపీఎం జిల్లా మహాసభలను నిర్వహించనున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ వెల్లడించారు. మహాసభల్లో భాగంగా రానున్న మూడు సంవత్సరాల్లో చేపట్టాల్సిన కర్తవ్యాలను నిర్ణయిస్తామన్నారు. రైతు, కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్న మహాసభల జయప్రదానికి ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు శ్రీనివాసులు, నల్లప్ప, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, రామిరెడ్డి, రామాంజనేయులు, నాగమణి, నిర్మల, జగన్, అచ్యుత్, మల్లికార్జున, నాగరాజు, చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్, వెంకటనారాయణ, గోపాల్, ముత్తుజ, ఇర్ఫాన్, చంద్రిక, పరమేష్ పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు

జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): కౌలు గుర్తింపు కార్డు పొందిన ప్రతి రైతూ బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చునని జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కృషిభవన్ నందు కౌలు రైతుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కౌలు గుర్తింపు కార్డులు ఉన్న రైతులు సమీప బ్యాంకుల్లో రుణాలు తీసుకోవచ్చు అన్నారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది ఈ విషయాన్ని కౌలు రైతులకు వివరించి రుణాలు పొందేలా చూడాలన్నారు. 2024-25 సంవత్సరం రబీసీజన్ నుంచి ప్రతి రైతు తమ పంటల బీమా పథకం కోసం డిసెంబరు-15లోగా ప్రీమియం చెల్లించాలన్నారు. సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలన్నారు. పంట నమోదును బట్టి నష్టం వాటిల్లిన సందర్భాల్లో పరిహారం వర్తిస్తుందన్నారు. అన్నదాత సుఖీభవ పథకానికి కౌలు రైతులు అర్హులే అన్నారు. రైతులు బ్యాంకుల్లో రూ.20 ప్రధానమంత్రి సురక్షకు, రూ.440 ప్రధాన మంత్రి జీవనజ్యోతికి డబ్బులు చెల్లించి బీమాలు పొందవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో ఏడీ రవి, ఏఓ శశికళ, ఏఈఓలు మురళీకృష్ణ, అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

సొంత స్థానాలకు పంపండి



డీఎంహెచ్ఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎన్జీఓ నేతలు, ఆరోగ్య కార్యకర్తలు

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్ర జ్యోతి): మహిళా ఆరోగ్యకార్యకర్తలను వారి సొంత స్థానాలకు పంపాలని డీఎంహెచ్ఓకు ఎన్జీఓ నాయకులు, ఆరోగ్య కార్యకర్తలు వినతి పత్రం ఇచ్చారు. మంగళవారం జిల్లా కార్యాలయంలో ఎన్జీఓ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్య కార్యకర్తలు డీఎంహెచ్ఓ డాక్టరు ఈబీదేవిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో జీఓ నెంబరు 143 ప్రకారం మహిళా కార్యకర్తలను రీ-డిప్లాయ్‌మెంట్ పేరుతో ఇతర పీహెచ్‌సీలు, యుపీహెచ్‌సీలకు బలవంతంగా పంపించారని తెలిపారు. దీంతో అనేక మంది దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై వైద్యశాఖ కమిషనర్‌ను కలవగా రీ-డిప్లాయ్‌మెంట్ ఉత్తర్వులను రద్దును చేస్తూ ఆరోగ్యకార్యకర్తలను తిరిగి సొంతస్థానాలకు పంపిస్తామని ఉత్తర్వులు ఇచ్చారని వివరించారు.

యువతి అదృశ్యం

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఓ యువతి అదృశ్యమైంది. నగరంలోని వేణుగోపాల్‌నగర్‌కు చెందిన సిరాజుద్దీన్‌కు నిషాత్ అంజుమ్, నేహా అంజుమ్ అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రెండో కుమార్తె నేహా అంజుమ్ ఇంటర్ వరకు చదువుకుని ఇంటి వద్దే ఉంటోంది. సిరాజుద్దీన్ బంధువు ఎవరో చనిపోతే నేహా అంజుమ్ మినహా కుటుంబసభ్యులంతా మంగళవారం ఉదయం 9గంటలకు మదనపల్లికి బయలుదేరి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో ఉన్న ఆమె వారు సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చే సరికి కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల, బంధువుల ఇళ్లకు వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆమె తండ్రి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

శవమై కనిపించిన పోస్టుమన్



రామాంజనేయులు (ఫైల్)

కళ్యాణదుర్గం, నవంబరు 19 (ఆంధ్ర జ్యోతి): మూడు రోజుల క్రితం పోస్టుమన్ చాకలి రామాంజనేయులు (62) అదృశ్యమైనట్లు కళ్యాణదుర్గం పట్టణ పోలీస్ స్టేషన్‌లో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం కళ్యాణదుర్గం మండలం హులికల్లు కొండ సమీపంలో అతడు రామాంజనేయులు వాడుతున్న ద్విచక్రవాహనం కనిపించింది. గొర్రెల కాపరులు.. పోలీసులకు సమాచారం అందించారు. వారు హులికల్లు కొండ వద్ద పరిశీలించగా రామాంజనేయులు శవం కనిపించింది. అక్కడే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు అక్కడి ఆనవాళ్లను బట్టి పోలీసులు నిర్ధారించారు. పని ఒత్తిడితోనే ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. కొన్నేళ్ల క్రితమే భార్య మృతి చెందడంతో ఒంటరిగానే జీవిస్తున్నాడు. మృతుడికి ఉమాదేవి, మహేష్ అను పిల్లలు వున్నారు. పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిమెంట్ అక్రమార్కులపై చర్యలు

ఈఈ, డీఈఈ, ముగ్గురు జేఈల నుంచి రికవరీకి ఆదేశం.. రూ.2.52 కోట్లు దుర్వినియోగమైనట్లు నిర్ధారణ

అనంతపురం సిటీ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీ రాజ్ శాఖలో సిమెంటులో అక్రమాలకు పాల్పడిన అధికారులను ఆ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర సబ్ డివిజన్ పరిధిలో అక్రమాలు జరిగినట్లు నిర్ధారించి ఆ శాఖకు చెందిన ఐదుగురు ఉద్యోగులను బాధ్యుల్ని చేస్తూ ఆశాఖ ప్రిన్సిపల్ సెక్రటరి శశిభూషణ్‌కుమార్ చర్యలు తీసుకున్నారు. 2021-22లో రూ. 2.52 కోట్లు విలువ చేసే సిమెంటును ఈఈ, డీఈఈతో మరో ముగ్గురు జేఈలు కలిసి ఈ అక్రమాలకు పాల్పడినట్లు అప్పట్లోనే గుర్తించారు. ఈఈని మినహాయించి మిగిలిన అధికారులను సస్పెండ్ చేశారు. తాజాగా పెనుకొండ డివిజన్ పీఆర్ఐ ఈఈ గోపాల్‌రెడ్డి (రిటైర్డు), మడకశిర అప్పటి డీఈఈ మల్లికార్జున, జేఈ పీఎస్ఎస్ రవికుమార్, గుడిబండ జేఈ కె.మద్దిలేటి, అగళి జేఈ బి. నాగన్నపై తాజాగా చార్జెస్ ఫ్రేమ్ చేశారు. దీంతో ఆ శాఖ ఉద్యోగుల్లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అలజడి రేపింది. దుర్వినియోగమైన రూ. 2.52 కోట్లు నగదును ఆయా ఉద్యోగుల్ని నుంచి రికవరీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ఐదుగురు ఉద్యోగుల్లో ఈఈ గోపాల్‌రెడ్డి రిటైర్డ్ అయ్యారు. మిగిలిన డీఈఈ, ముగ్గురు జేఈలు వేర్వేరు ప్రాంతాల్లో ఉద్యోగం చేస్తున్నారు. గతంలో ఇతర నియోజక వర్గాల్లో జరిగిన సిమెంట్ అక్రమాలపై ప్రస్తుత ప్రభుత్వం ఆరాతీస్తున్నట్లు తెలుస్తోంది.

సీపీఐ మహిళా సమాఖ్య నేత మృతి

పార్టీ శ్రేణుల దిగ్భ్రాంతి.. నేడు మెడికల్ కళాశాలకు భౌతిక కాయం



శకుంతలమ్మ (ఫైల్)

అనంతపురం విద్య/కల్చరల్/అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకురాలు, మహిళా సమాఖ్య నేత శకుంతలమ్మ (66) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. కొంత కాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఒక వైపు వృద్ధాప్యం, మరోవైపు అనారోగ్యంతో బాధపడుతున్న ఆమెను కుటుంబికులు నాలుగు రోజుల కిందట సాయినగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె మరణించారు. శంకుంతలమ్మ గతంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షురాలిగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర నాయకురాలిగా పనిచేశారు. పార్టీకి, అనుబంధ సంఘాలకు ఎంతగానో సేవలు అందించారు. గత కొన్నేళ్ల కిందట ఆమెకు బైపాస్ సర్జరీ చేయించారు. నాలుగు రోజులు కిందట ఆరోగ్య సమస్యలు ఎదురుకావడంతో... ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి వైద్య సేవలు అందించారు. మధ్యాహ్నం తర్వాత ఆమె తుది శ్వాస విడిచారు. సీపీఐ, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య నేతలు ఆమె మరణంపై తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. బుధవారం ఆమె భౌతిక కాయాన్ని కుటుంబ సభ్యులు వైద్య విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలకు అందించనున్నారు. శకుంతలమ్మ మృతి చెందడం బాధాకరం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యుడు జగదీష్, జిల్లా కార్యదర్శి జాఫర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో కమ్యూనిస్టు పార్టీ, మహిళా సమాఖ్య నేతగా ఆమె ఎంతగానో సేవలు అందించారన్నారు. శకుంతలమ్మ పోరాటాలు ఆదర్శనీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్, ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి పేర్కొన్నారు. ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మహిళలు రాజకీయాల్లో రావాలంటే భయపడే రోజుల్లోనే ఆమె కమ్యూనిస్టు ఉద్యమాల్లో పాల్గొన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ ఒక ప్రకటనలో కొనియాడారు. ఆమె మృతదేహాన్ని మెడికల్ కళాశాలకు అప్పగించడం గొప్ప నిర్ణయమన్నారు.

రేపు గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు ఈనెల 21న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మోహన్‌కుమార్ తెలిపారు. కళాశాలలో బోటనీ, జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయనీ, వాటి భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. వృక్షశాస్త్రం, జంతుశాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తి చేసిన అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఈనెల 21న మధ్యాహ్నం 2 గంటలకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు.

గంజాయి విక్రేతల అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐలు

లేపాక్షి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న ఆరుగురిని మంగళవారం హిందూపురం రూరల్ పోలీసులు మండలంలోని చోళసముద్రం గ్రామ సమీపాన అరెస్టు చేశారు. హిందూపురం అర్బన్, రూరల్ సీఐలు ఆంజనేయులు, జనార్దన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చోళసముద్రం సమీపంలోని హెరిటేజ్ డెయిరీ వద్ద ఏపుగా పెరిగిన చెట్లలో గంజాయి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో మంగళవారం దాడులు చేసి, ఆరుగురిని పట్టుకున్నారు. పరిగి మండలం సేవామందిరానికి చెందిన సయ్యద్ బషీర్‌అలీ, హిందూపురం రైల్వేరోడ్డు నివాసి వంశీకృష్ణ, రహమత్‌పురం ప్రాంతానికి చెందిన ఉదయ్‌కర్ణ, అహ్మద్‌నగర్ వాసి సైఫుల్లాఖాన్, లేపాక్షి మండలం పి.కొత్తపల్లికి చెందిన సయ్యద్ అమీర్, హిందూపురం మండలం మరువపల్లికి చెందిన పూరింటి తిమ్మప్ప పట్టుబడిన వారిలో ఉన్నారు. వారి నుంచి 1.8 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. దాడుల్లో హిందూపురం వన్‌టౌన్ ఎస్ఐ శ్రీధర్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలపై ఐక్య ఉద్యమం

● నేడు, రేపు జీపు జాతా ● సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర



మహాధర్నా కరపత్రాలు విడుదల చేస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతాంగం, కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఐక్య ఉద్యమం చేపట్టనున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ పేర్కొన్నారు. సమస్యల పరిష్కారాన్ని కోరుతూ ఈనెల 26న కలెక్టరేట్ ముందు చేపట్టే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతాంగానికి, కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీలకు లాభాలు కట్టబెట్టేందుకు రైతులు, కార్మికులు, ప్రజలపై భారాలు వేస్తున్నారని విమర్శించారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ.14.65 లక్షల కోట్లు మాఫీ చేసిందన్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతాంగానికి ఒక్క పైసా కూడా మాఫీ చేయలేదని పేర్కొన్నారు. కార్మిక, కర్షక ఐక్యతతో ఈనెల 26న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హెచ్చరిక నోటీసులు జారీ చేస్తూ చలో కలెక్టరేట్ చేపడుతున్నామన్నారు. చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని కోరుతూ బుధ, గురువారాల్లో జిల్లా వ్యాప్తంగా జీపుజాతా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, వివిధ సంఘాల నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, తరిమెల నాగరాజు, భాస్కర్, జగన్మోహన్‌రెడ్డి, వెంకటనారాయణ, అచ్యుత్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు



డీఈఓను కలిసిన గంధం శ్రీనివాసులు

అనంతపురం విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా సాధారణ పరీక్షల మండలి (డీసీఈబీ) నూతన కార్యదర్శిగా గంధం శ్రీనివాసులు నియమితుదయ్యారు. ఈ మేరకు అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి, డీసీఈబీ చైర్మన్ ప్రసాద్‌బాబు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. శ్రీనివాసులు కళ్యాణదుర్గం కేసీ గవర్నమెంట్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. కొత్తగా నియమితులైన శ్రీనివాసులు డీఈఓను మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

అక్రమాలతో పురుషోత్తం వెనక్కు..

గత రెండేళ్లలో డీసీఈబీలో అనేక అక్రమాలు చేశారు. ప్రశ్నపత్రాల ముద్రణ, సరఫరా, టెండర్లు.. ఇలా ప్రతి అంశంలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. 2022-20 23, 2024-25 విద్యా సంవత్సరాల్లో జరిగిన అనేక గోల్‌మాల్ వ్యవహారాలపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు వచ్చాయి. దీంతో జిల్లా కలెక్టర్, కడప ఆర్జేడీ వేర్వేరుగా విచారణకు ఆదేశించారు. విచారణ తర్వాత గత నెల 30న డీసీఈబీ కార్యదర్శి పురుషోత్తం బాబుపై ఆర్టికల్ ఆఫ్ చార్జెస్ ఫ్రేం చేయాలని ఆర్జేడీ శామ్యూల్ ఉత్తర్వులు జారీచేశారు. అదే విధంగా పురుషోత్తంబాబును డీసీఈబీ కార్యదర్శి పోస్టు నుంచి తప్పించాలంటూ జిల్లా విద్యాశాఖాధికారికి ఆదేశాలిచ్చారు. దీంతో డీఈఓ ప్రసాద్‌బాబు డీసీఈబీ కార్యదర్శిగా గంధం శ్రీనివాసులును నియమించారు. డీసీఈబీ కార్యదర్శి బాధ్యతలను శ్రీనివాసులకు అప్పగించాలని పురుషోత్తం బాబును ఆదేశించారు.

నేటి నుంచి పెయ్య దూడలకు టీకాలు

అనంతపురం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అనంత ఉమ్మడి జిల్లాలోని 4 నుంచి 8 మాసాల వయస్సు కలిగిన పెయ్య దూడలకు బుధవారం నుంచి ఉచిత బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేస్తామని పశుసంవర్ధక శాఖ జేడీ వెంకటస్వామి, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రామచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డిసెంబరు 19వరకు టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి జిల్లాలోని 13,800 పెయ్యదూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలను వేయాలని నిర్ణయించామన్నారు.

అనంత జిల్లాకు 6,060 డోసులు, శ్రీసత్యసాయి జిల్లాకు 6,750 డోసుల టీకాలు సరఫరా చేశామన్నారు. పశువుల్లో జ్వరం, బలహీనత, చూడి ఆఖరి దశలో గర్భస్రావం, మాయ వేయకపోవడం, గర్భస్రావాలు, చూడి నిలవకపోవడం బ్రూసెల్లోసిస్ వ్యాధి లక్షణాలన్నారు. వ్యాధి సోకిన పశువుల నుంచి మనుషులకు సోకుతుందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని తప్పనిసరిగా బ్రూసెల్లోసిస్ వ్యాధి నివారణ టీకాలు వేయించాలన్నారు.

న్యూస్‌బాక్స్

టమోటా కిలో రూ.30

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ. 30 తో అమ్ముడు పోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. మార్కెట్‌కు మంగళవారం 675 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. కిలో సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.16 పలికినట్లు ఆయన తెలిపారు.

చీనీ టన్ను రూ.37 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవ సాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 37,760 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8 వేలు, సరాసరి రూ.24 వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 65టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

1090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయరుకు ప్రస్తుతం 1090 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నీరు వస్తున్నట్లు మంగళవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో ఇన్‌ఫ్లో 1090 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కింద హెచ్ఎన్ఎస్ఎస్-2కు 993 క్యూసెక్కులు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.593 టీఎంసీల నీరు నిల్వ వుందని అధికారులు తెలిపారు.

25 నుంచి బధిరుల క్రికెట్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బధిరుల అండర్-19 జాతీయ స్థాయి క్రికెట్ టీ-20 చాంపియన్‌షిప్ పోటీలు ఈనెల 25 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా బధిరుల క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరెడ్డి తెలిపారు. 25 నుంచి 28వతేదీ వరకు ఆర్డీటీ స్టేడియంలో నాలుగు రోజుల పాటు సాగే పోటీలకు దేశవ్యాప్తంగా సుమారు 15 జట్లు పాల్గొంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9493362154ను సంప్రదించాలని కోరారు.

క్రైంకార్నర్

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



సుధాకర్‌రెడ్డి (ఫైల్)

నల్లమాడ, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండ్రవారిపల్లికి చెందిన రైతు సుధాకర్ రెడ్డి (48) అప్పుల బాధ భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. రైతు తండ్రి పెద్దగంగిరెడ్డి.. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. సుధాకర్‌రెడ్డికి 15 ఎకరాల పొలం ఉంది. పదెకరాల్లో మామిడి చెట్లు పెట్టాడు. మిగతా భూమిలో వరి, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేస్తుండేవాడు. అతివృష్టి, అనావృష్టి పంటలు దక్కక నష్టపోయాడు. అప్పులపాలయ్యాడు. దీనికితోడు తల్లి అనారోగ్యం బారిన పడడంతో వైద్యం చేయించేందుకు మరిన్ని అప్పులు చేశాడు. మొత్తంగా అప్పులు రూ.20 లక్షల వరకు ఉన్నట్లు కుటుంబీకులు తెలిపారు. వాటిని ఎలా తీర్చాలోనని సుధాకర్ రెడ్డి ఆవేదన చెందుతుండేవాడు. ఈనేపథ్యంలోనే మనస్తాపం చెంది తన మామిడి తోటలో సోమవారం రాత్రి పంటకు కొట్టే విషద్రావకం తాగాడు. మిత్రుడికి ఫోన్ ద్వారా విషయం తెలిపాడు. అతడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. హుటాహుటిన తోటకెళ్లి అసస్మారక స్థితిలో ఉన్న సుధాకర్ రెడ్డిని నల్లమాడ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్సల అనంతరం కదిరికి తీసుకెళ్లగా.. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని కదిరి ఆస్పత్రికి తరలించారు. రైతు భార్య చాముండి 13 ఏళ్ల క్రితమే అనారోగ్యంతో మరణించింది. అతడికి తల్లిదండ్రులు, కుమారుడు విజయ సింహారెడ్డి ఉన్నారు. రైతు ఆత్మహత్యపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సదా ప్రజాసేవలో...!

సమాజ సేవకు శ్రమిస్తున్న బద్దేనాయక్

ఆపన్నులు, పేదలకు ఆర్థికసాయం

పదేళ్లలో రూ.కోటికిపైగా...

హిందీ టీచర్‌పై సర్వత్రా ప్రశంసలు



పాళ్లూరు వెంకటంపల్లి తండాలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

> 'దేశమును ప్రేమించుమన్న
> మంచి అన్నది పెంచుమన్న
> వొట్టి మాటలు కట్టి పెట్టి
> గట్టి మేల్ తలపెట్టవోయి.'
> - గురజాడ

ఈ మాటలే స్ఫూర్తిగా సమాజసేవలో ముందుకెళ్తున్నాడు కంబదూరు మండలం పాళ్లూరు వెంకటంపల్లి తండాకు చెందిన హిందీ ఉపాధ్యాయుడు బద్దేనాయక్. పేద కుటుంబంలో జన్మించిన ఈయన చిన్నప్పటి నుంచి కష్టాలు, కన్నీళ్ల మధ్య పెరిగాడు. పేదరికం ఎంత భయంకరంగా ఉంటుందో అనుభవించాడు. అందుకే తాను మంచి స్థితిలోకి వచ్చిన తర్వాత పేదలను ఉద్ధరించాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నాడు. ఆ క్రమంలోనే ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ ఉద్యోగం వచ్చాక పలు సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వాటిని చూసిన పలువురు ఆయన్ను ప్రశంసిస్తున్నారు.

కుటుంబ నేపథ్యం

పాళ్లూరు వెంకటంపల్లి తండాకు చెందిన లక్ష్మీబాయి, వెంకటానాయక్ దంపతులకు ముగ్గురు మగ సంతానం. వీరిలో ఆఖరివాడు బద్దేనాయక్. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో 1996లో ప్రభుత్వం రెండెకరాల వ్యవసాయ భూమిని ఇచ్చింది. ఆభూమిలో శ్రద్ధగా వ్యవసాయం చేస్తూ తమ పిల్లలను చదివించుకునేవారు. పంటలు బాగా పండటంతో పాటు, ఇద్దరు బిడ్డలు బాగా చదివి ప్రయోజకులయ్యారు. పెద్ద కుమారుడు తిమ్మానాయ్ ఓ ప్రైవేట్ సంస్థలో ఉద్యోగం చేస్తుండగా రెండో కుమారుడు రమేష్ నాయక్ తల్లిదండ్రులకు తోడుగా వ్యవసాయం చేస్తున్నా డు. వ్యవసాయం లాభసాటిగా మారడంతో ప్రభుత్వం ఇచ్చిన భూమికి మరి కొంత భూమిని కొనుక్కున్నారు. ఈక్రమంలోనే వారి ఆస్తి 16 ఎకరాలకు పెరిగింది. అందులో టమోటా, కర్భూజ, కళింగర, చీనీ, వేరుశనగ పంటలను సాగు చేస్తూ అధిక దిగుబడులు తీస్తున్నారు.



మాస్టారు ఇచ్చిన విద్యాసామగ్రితో విద్యార్థులు

ఉద్యోగం వచ్చిన తరువాతే ముందడుగు

ఈక్రమంలోనే డీఎస్సీ-2012లో బద్దే నాయక్ గ్రేడ్-2 హిందీ పండిట్ ఉద్యోగాన్ని సాధించాడు. మొదటి పోస్టింగు శెట్టూరు మండలం కైరేవు ప్రాథమికోన్నత పాఠశాలలో లభించింది. అక్కడి పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విద్యార్థి శిల్ప గుండె జబ్బు వ్యాధితో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఆయన ఆ విద్యార్థికి సాయం చేయాలని అనుకున్నాడు. అదే తడవుగా విద్యార్థి తల్లిదండ్రుల వద్దకు వెళ్లి హార్ట్ ఆపరేషన్‌కు కొంత ఆర్థిక సాయాన్ని అందించారు. తర్వాత పాళ్లూరు వెంకటంపల్లిలో రూ. 5 లక్షలు విలువ చేసే మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశాడు. విద్య, వైద్యానికి సాయం చేయాలని ఎవరైనా యువకులు, గ్రామస్థులు సమాచారం అందిస్తే వెంటనే సాయం అందించాడు. సోషల్ మీడియా, వార్తా పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కూడా ఎంతోమందికి ఆర్థిక సాయం అందించారు. 2015 నుంచి సేవా కార్యక్రమాల కోసం తనకు వచ్చే జీతంలో 45 శాతం వినియోగిస్తున్నాడు. వ్యవసాయంలో వచ్చే ఆదాయాన్ని కూడా సమాజ శ్రేయస్సుకు ఖర్చు చేస్తున్నాడు. ఇన్ఫినిటీ చారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి ఎంతో మందికి విద్య, వైద్య కోసం ఆర్థిక సాయాన్ని అందించి ఆదుకున్నారు. సుమారు 700 మందికి పైగా రూ.కోటి వరకు ఆర్థికసాయాన్ని అందించారు. ఈయనకు 2019లో గ్రేడ్-1 స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి వచ్చింది. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

- కళ్యాణదుర్గం



మదర్‌థెరిసా ఆదర్శం

మదర్‌థెరిసా నాకు ఆదర్శం. ఎక్కడి నుంచో వచ్చి మనదేశంలో ఆమె చేసిన సేవా కార్యక్రమాలు తెలుసుకుని స్ఫూర్తి పొందా. అలాగే ఆ నలుగురు సినిమా చూసినప్పటి నుంచి మరణించాక మన వెంట వచ్చేది మనం చేసిన మంచి తప్ప ఏదీ కాదని తెలుసుకుని ఆపదలో ఉన్న వారికి ఆర్థిక సాయం అందచేస్తున్నా. నాకు వచ్చే జీతంలో 45 శాతం ఇతరుల కోసం ఖర్చు చేస్తున్నా. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటేనే మానవ జన్మకు సార్థకత.

బద్దేనాయక్, ఉపాధ్యాయుడు

మా పాఠశాల అదృష్టం



సేవా కార్యక్రమాలు చేసే ఉపాధ్యాయుడు బద్దేనాయక్ మా పాఠశాలలలో ఉండటం మా అదృష్టంగా భావిస్తున్నాం. మేము కూడా బద్దేనాయక్ బాటలో తోచినంత సాయం చేస్తున్నాం. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇలా సేవా కార్యక్రమాలతో ఆదర్శంగా నిలవడం గర్వించదగ్గ విషయం.

- భాస్కర్, ప్రధానోపాధ్యాయుడు, మాకొడికి ఉన్నత పాఠశాల

స్కూల్‌లోనే స్వీపర్ పోస్టు ఇప్పించాడు



నాకు నలుగురు ఆడపిల్లలు. కుటుంబ పోషణ కష్టంగా ఉండేది. అలాంటి సమయంలో నా కష్టాన్ని విన్న బద్దేనాయక్ సార్, కైరేవు స్కూల్లోనే స్వీపర్ పోస్టు ఇప్పించి, నెలకు రూ. 2 వేలు జీతం ఇచ్చేవాడు. ఇప్పుడు ఆ స్వీపర్ పోస్టు రెగ్యులర్ చేశారు. నా కుమార్తె పెళ్లికి కూడా రూ. 15 వేలు ఆర్థికసాయం చేశారు.

-అంజినమ్మ, కైరేవు, శెట్టూరు మండలం

మా అబ్బాయి గ్రూప్ వన్ కోచింగ్‌కు సాయం



నా భర్త ఎనిమిదేళ్ల కిందట మరణించాడు. అప్పటి నుంచి నేను కూలి పనికి వెళ్తూ నా కుమారుడిని పోషిస్తున్నా. బద్దేనాయక్ సార్ మా లాంటి పేద కుటుంబాలను ఆదుకుంటారని తెలిసి నా కొడుకు కోసం వెళ్లా. మా కుటుంబ స్థితిగతులను తెలుసుకున్న ఆయన నా కొడుకు గ్రూప్ వన్ కోచింగ్‌కు రూ. 60 వేలు ఆర్థిక సాయం అందించారు. ఇప్పుడు మా అబ్బాయి హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకుంటున్నాడు.

-నాగమ్మ, మాకొడికి, శెట్టూరు మండలం

పరాజయం.. పరిపూర్ణం..!

మూడో మ్యాచ్‌లోనూ ఓడిన ఏపీ జట్టు

సంతోష్‌ట్రోఫీ ఫుట్‌బాల్ టోర్నీలో ఖేల్ ఖతం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): హ్యాట్రిక్ ఓటములతో ఆతిథ్య జట్టు ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర పరాభవం ఎదురైంది. గత ఆరు రోజులుగా స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న సంతోష్‌ట్రోఫీ-2024 ఫుట్‌బాల్ పోటీలు మంగళవారం ముగిశాయి. ఉదయం ఆంధ్రప్రదేశ్, తమిళనాడు నికోబర్ జట్ల మధ్య జరిగింది. మొదటి నుంచి ఎలాంటి పోరాట పటిమ ప్రదర్శించని ఏపీ జట్టు తమిళనాడుపై 8 గోల్స్ తేడాతో ఓటమి పాలైంది. దీంతో ఆంధ్రా జట్టు హ్యాట్రిక్ ఓటమిని చవి చూసింది. తమిళనాడు ఆటగాళ్లు లిజో 4గోల్స్ నందకుమార్ అనంతరాజ్ 2గోల్స్ చేయగా హెన్రీ జోసెఫ్ ఇమ్మానుయేల్, రీగాన్ చెరో గోల్ చేశారు. దీంతో ఆడిన మూడు మ్యాచుల్లో హ్యాట్రిక్ విజయాన్ని నమోదు చేసిన తమిళనాడు గ్రూప్-జీలో ప్రథమ స్థానంలో నిలిచింది. మరో మ్యాచ్ మధ్యాహ్నం అండమాన్ నికోబర్, కర్ణాటక జట్లు తలపడ్డాయి ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో కర్ణాటక జట్టులోని ప్లేయర్లు నిఖిల్‌రాజ్ మురుగేష్‌కుమార్ 4 గోల్స్, రాయన్ విల్‌ఫ్రెడ్ 2గోల్స్ కొట్టారు. ఆండ్ర్యూ గురుంగ్, కార్తిక్ గోవిందస్వామి, సూర్య, సుజయ్, సయ్యద్ అహ్మద్‌లు చెరో గోల్ కొట్టారు. దీంతో కర్ణాటక జట్టు అండమాన్‌పై 11 గోల్స్ తేడాతో విజయాన్ని అందుకుంది. ట్రోఫీలో తమిళనాడు 9 పాయింట్లుతో ప్రథమ స్థానంలో నిలవగా, కర్ణాటక 6 పాయింట్లతో ద్వితీయ స్థానం, అండమాన్ నికోబర్ 3 పాయింట్లతో తృతీయ స్థానం, ఆంధ్రప్రదేశ్ సున్నా పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది.

ఓడీఎఫ్ రహిత జిల్లాగా నిలుపుదాం

మరుగుదొడ్ల వినియోగాన్ని ప్రోత్సహిద్దాం

కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపు

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత మరుగుదొడ్లను వందశాతం వినియోగించుకునేలా ప్రోత్సహిద్దామని కలెక్టర్ వినోద్‌కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో పారిశుధ్య కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు మరుగుదొడ్ల నిర్మాణాలను ప్రోత్సహిస్తూ నిధులు విడుదల చేశాయన్నారు. ప్రజలు వాటిని ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలని ఆదేశాలు ఇచ్చాయని అన్నారు. అందులో భాగంగానే మనమరుగుదొడ్డి-మనగౌరవం నినాదంతో డిసెంబరు 10వరకు ప్రత్యేక కార్యక్రమం చేపడుతున్నామని తెలిపారు. జిల్లాలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిచాలని అధికారులను ఆదేశించారు. మరుగుదొడ్ల మరమ్మతులు, కమ్యూనిటీ మరుగుదొడ్లను సుందరీకరించడం, పారిశుధ్య వీరులను గుర్తించి సన్మానించడం తదితర కార్యక్రమాలు కొనసాగించాలన్నారు. మరుగుదొడ్ల వాడకంలో నీటి లభ్యత చాలా ముఖ్యమని, ప్రతి మరుగుదొడ్డికి నీటి సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సురేష్, డీపీఓ నాగరాజు, డీఎంహెచ్ఓ ఈబీ దేవి, డీఈఓ ప్రసాద్‌బాబు, డీపీఆర్ఓ గురుస్వామిశెట్టి, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

లాఠీపై వేటు

- అవినీతి ఆరోపణలతో వీఆర్‌కు 15 మంది
- నలుగురు ఏఎస్ఐలు, ఆరుగురు హెచ్‌సీలు, ఐదుగురు కానిస్టేబుళ్లు

అనంతపురం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అవినీతి ఆరోపణలు, అసాంఘిక కార్యకలాపాలకు సహకారం, డబ్బు వసూలు చేయడం లాంటి వ్యవహారాలకు పాల్పడిన పోలీసులను వీఆర్‌కు పంపారు. జిల్లాలో హెచ్చుమీరి ప్రవర్తిస్తున్న పోలీసులపై ఎస్పీ జగదీష్ దృష్టి సారించారు. ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు మచ్చ తీసుకొచ్చేలా వ్యవహరిస్తున్న వారిపై చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా 15 మందిని జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లో రిపోర్ట్ చేసుకోవాలని ఆదేశించారు. వీటిలో కొన్ని శాఖ పరంగా ఆరా తీయగా, కొన్ని నేరుగా ప్రజల నుంచే ఎస్పీకి ఫిర్యాదులు అందినట్లు సమాచారం. వారిపై బదిలీ వేటు ఖాయంగా కనిపిస్తోంది. అత్యధికంగా పెద్దపప్పూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లు అశోక్, శ్రీనివాసరారెడ్డి, యాడికి కానిస్టేబుల్ విజయ్‌కుమార్, పెద్దవడుగూరు హోంగార్డు లోకేశ్వర్‌రెడ్డి, తాడిపత్రి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుళ్లు మల్లికార్జున, చాంద్‌బాషా, కానిస్టేబుల్ ప్రసాద్ నాయక్, తాడిపత్రి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుళ్లు పవన్‌కుమార్, రామాంజనేయులు, మనోహర్‌రెడ్డి, పుట్లూరు హెడ్‌కానిస్టేబుల్ నూరుల్లా, అనంతపురం వన్‌టౌన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుళ్లు నరసింహులు, అశోక్, కళ్యాణదుర్గం ఏఎస్ఐ రాజశేఖర్, కుందుర్పి కానిస్టేబుళ్లు సురేష్‌బాబు, రెహమాన్, బుక్కరాయసముద్రం హెడ్ కానిస్టేబుల్ జాన్సన్‌లపై వేటు పడింది. వీరిలో మంగళవారం ఎనిమిది మంది వరకు రిపోర్టు చేసుకున్నట్లు సమాచారం. తొలి జాబితాలో వచ్చిన వీరిలో ఓ ఎనిమిది మంది ప్రజలతో మర్యాద లేకుండా మాట్లాడి డబ్బు వసూలు చేసినట్లు సమాచారం. కళ్యాణదుర్గం ఏఎస్ఐ, మరి కొందరు ప్రజలిచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు సమాచారం. వీరిలో ఓ కానిస్టేబుల్, హెడ్‌కానిస్టేబుల్ డ్యూటీ ఒకచోట, డీఓ మరోచోట ఉండి పనిచేస్తుండటంతో వారిని కూడా బదిలీ చేయనున్నట్లు తెలిసింది.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అప్పుల ఒత్తిళ్లు, మానసిక ఇబ్బందులతో సిండికేట్‌నగర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ రమేష్(32) మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కణేకల్లు మండలం నాగేపల్లికి చెందిన రమేష్ బెంగుళూరుకు చెందిన ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. ప్రస్తుతం సిండికేట్‌నగర్‌లో భార్య, పిల్లలతో ఉంటూ.. వర్క్ ఫ్రమ్ హోమ్ చేస్తున్నాడు. మానసిక ఇబ్బందులు ఉండటంతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నాడు. స్వగ్రామంలో ఇంటి నిర్మాణం కోసం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఒత్తిడి ఎదుర్కోలేక తన ఇంట్లోనే సోమవారం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో ఉండగా కుటుంబ సభ్యులు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం సాయంత్రం మృతిచెందాడు. అనంతపురం రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త: ఎస్పీ

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలు పెరుగుతున్నాయని, సెల్‌ఫోన్‌ను వినియోగించే ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ జగదీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. చదువు రానివారితోపాటు ఉన్నత విద్యావంతులు కూడా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుంటున్నారని పేర్కొన్నారు. కొరియర్ పేరుతో మోసాలు, చైల్డ్ పోర్నోగ్రఫీ, డిజిటల్ అరెస్ట్, ఓటీపీ మోసాలు, లోన్ యాప్, హనీ ట్రాప్, లాటరీల పేరుతో మోసాలు, లక్షలు పెట్టుబడి పెడితే కోట్లు ఇస్తామని నమ్మబలకడం, వీడియో కాల్స్ చేసి స్క్రీన్ రికార్డు చేసి బ్లాక్‌మెయిల్ చేయడం.. ఇలా ఎన్నో రకాల మోసాలకు పాల్పడుతున్నారని అన్నారు. బ్యాంకు ఖాతాలకు స్ట్రాంగ్ పాస్‌వర్డ్‌లను సెట్ చేసుకుని, సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే.. వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేసి సమాచారం అందించాలని, లేదా నేషనల్ సైబర్ క్రైమ్ పోర్టల్ డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.సైబర్‌క్రైం.జీఓవీ.ఇన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అప్పగింత



ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్ఐ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్‌ను తిరిగి సాఫ్ట్‌వేర్ ఉద్యోగికి చెన్నేకొత్తపల్లి పోలీసులు మంగళవారం అప్పగించారు. సోమవారం రాత్రి గ్రామంలో గస్తీకి వెళ్లిన సమయంలో న్యామద్దల రోడ్డు పక్కన ఓ దుకాణం వద్ద పోలీసులకు లగేజ్ బ్యాగ్ కనిపించింది. దీంతో ఆ బ్యాగును స్టేషన్‌కు తీసుకువచ్చి పరిశీంచగా ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, ఐడీ కార్డులు ఉన్నాయి. ఐడీ కార్డు ఆధారంగా కంపెనీకి ఫోన్‌చేసి వివరాలు తెలుసుకున్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం బోపాల్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సూరజ్ మిశ్రా అని తెలుసుకుని సమాచారం తెలియజేశారు. దీంతో కంపెనీ నిర్వాహకులు హైదరాబాద్ నుంచి ఒక ఉద్యోగిని సీకే పల్లికి పంపించారు. దీంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ సత్యనారాయణ ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్, లగేజీ బ్యాగును అప్పగించారు.

అపార్‌పై అశ్రద్ధ తగదు: ఆర్ఐఓ



మాట్లాడుతున్న ఆర్ఐఓ వెంకటరమణనాయక్

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో అపార్‌పై అశ్రద్ధ తగదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్ఐఓ) వెంకటరమణ నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాళ్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మాట్లాడుతూ అపార్ ఐడీలు జనరేట్ చేయడంలో ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆధార్ అప్‌డేట్ సెంటర్‌లో పదో తరగతి మార్కుల జాబితాల ఆధారంగా పేర్లను సరిచేసుకోవాలన్నారు. అపార్ ఐడీల నమోదులో ఎదురయ్యే సమస్యలపై పలు సూచనలు చేశారు. వచ్చే ఏడాది మార్చిలో జరిగే ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల ఫీజును ఈనెల 21వ తేదీలోగా చెల్లించాలన్నారు. 22వ తేదీ నుంచి రూ. 1000 అపరాధ రుసుంతో చెల్లించేందుకు అవకాశం ఉందని గుర్తు చేశారు. సమావేశంలో అనంతపురం అర్బన్ డీఎస్పీ శ్రీనివాసులు, సమగ్రశిక్ష అధికారి నారాయణస్వామి, జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, సోషల్ వెల్ఫేర్, ప్రైవేట్, మోడల్ స్కూల్ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు

పెనుకొండ రూరల్/కదిరి అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన నలుగురు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు నమోదు చేసినట్లు రొద్దం ఎస్ఐ నరేంద్ర మంగళవారం తెలిపారు. రొద్దం మండలం నాగిరెడ్డిపల్లికి చెందిన బాలాజీరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రెడ్డిపల్లి వాసి అశోక్‌రెడ్డి సోషల్ మీడియాలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌పై అనుచిత పోస్టులు పెట్టారని ఆయన తెలిపారు. రొద్దం మండలంలోని పెద్దగువ్వలపల్లికి చెందిన పవన్ ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అమర్‌నాథ్ రెడ్డిపై మరో కేసు

కదిరి మండలంలోని వీరచెన్నయ్యగారిపల్లికి చెందిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అమర్‌నాథ్‌రెడ్డిపై మరో కేసు నమోదైంది. గుంటూరు జిల్లా పెదనందిపాడు పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్, ప్రభుత్వంపై అమర్‌నాథ్‌రెడ్డి సోషల్ మీడియాలో కించపరిచేలా పోస్టులు పెట్టినందుకు పెదనందిపాడుకు చెందిన ఐటీడీపీ కార్యకర్త ఖలీల్ ఈనెల 10న పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం వీరచెన్నయ్యగారిపల్లికి వచ్చారు. అమర్‌నాథ్‌రెడ్డి అందుబాటులో లేకపోవడంతో అతడి ఇంటికి నోటీసులు అతికించారు. వారంలోపు స్టేషన్‌కు వచ్చి సమాధానం చెప్పకపోతే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నట్లు కదిరి రూరల్ అప్‌గ్రేడ్ సీఐ మోహన్ తెలిపారు. కాగా, అమర్‌నాథ్‌రెడ్డిపై సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి ఇదివరకే రెండు కేసులు నమోదయ్యాయి.

సంక్షిప్తం

సామరస్యంగా పరిష్కరించుకోండి

● ఆర్డీఓ కేశవనాయుడు

గార్లదిన్నె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సమస్యలుంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఆర్డీఓ కేశవనాయుడు రైతులకు సూచించారు. మండలంలోని సంజీవపురం, యర్రగుంట్ల గ్రామాల్లో కొంతకాలంగా నెలకొన్న రస్తా, భూ సమస్యలపై ఆయన మంగళవారం తహసీల్దార్ బండారు ఈరమ్మతో కలసి పరిశీలించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడు తూ... ప్రభుత్వం చేసిన రీ సర్వేతో గ్రామాల్లో రైతులకు చిన్నచిన్న సమస్యలు తలెత్తినట్లు తమ దృష్టికి వచ్చాయన్నారు. సమస్యలను సంబంధిత అధికారులు పరిశీలించి పరిష్కరిస్తారని తెలిపారు.

జోరుగా సభ్యత్వ నమోదు



తపోవనంలో సభ్యత్వ నమోదు చేస్తున్న నాయకులు

అనంతపురం రూరల్, నవంబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ. నారాయణపురంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. పార్టీ క్లస్టర్ ఇన్‌చార్జ్ డిష్ నాగరాజు ఆధ్వర్యంలో మంగళవారం డీలర్, రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి రఘురాయల్ తదితరులు పంచాయతీలోని తపోవనంలో సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేస్తూ సభ్యత్వం చేయించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ నాగరాజు మాట్లాడుతూ.. అర్బన్ నియోజకవర్గంలోని 12 క్లస్టర్లలో నారాయణపురం మొదటిస్థానంలో ఉందన్నారు. ఇప్పటి వరకు 3,700 సభ్యత్వ నమోదు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటలక్ష్మి, వరాలమ్మ, రజిని, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

అదృశ్యమైన వ్యక్తి కర్నూలులో...

అనంతపురం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగరంలో అదృశ్యమైన ఓ బుద్ధిమాంద్యుడు కర్నూలులో ప్రత్యక్షమయ్యాడు. నగరంలోని రామ్‌నగర్‌కు చెందిన లగిశెట్టి శశికాంత్ కుమారుడు లగిశెట్టి సంపత్ చిన్నప్పటి నుంచి బుద్ధిమాంద్యంతో బాధపడేవాడు. రెండురోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అతడు మంగళవారం కర్నూలులో కనిపించినట్లు బంధువులు పోలీసులకు సమాచారం అందించారు.

బాలికల సంరక్షణే ధ్యేయం: ఆర్జేడీ



కొవ్వొత్తుల ప్రదర్శనలో ఆర్జేడీ రోహిణి

అనంతపురం విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : లైంగిక వేధింపుల నుంచి బాలికలను రక్షించడమే తమ ధ్యేయమని ఐసీడీఎస్ కర్నూలు ఆర్జేడీ రోహిణి పేర్కొన్నారు. జిల్లాకు వచ్చిన ఆమె మంగళవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. పీడీ కార్యాలయంలో ఐసీడీఎస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం ప్రపంచ బాలల లైంగిక వేధింపుల వ్యతిరేక దినం, బాలల హక్కుల వారోత్సవాలు, దత్తత మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి పీడీ శ్రీదేవి, ఇతర అధికారులు, నలంద విద్యార్థినులతో కలసి రైల్వేస్టేషన్ వద్ద కొవ్వొత్తుల ర్యాలీ, ప్రదర్శన, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. బాలికలకు అన్నిప్రాంతాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ ఎంతైనా అవసరం అన్నారు. ఎక్కడికక్కడ అరికట్టాల్సి ఉందన్నారు. మానవ అక్రమ రవాణను సైతం అధికారులు నిరోధించాలని సూచించారు. కార్యక్రమంలో నలంద కళాశాల ప్రిన్సిపాల్ ఖాజీబాబు, ఆర్పీఎఫ్ ఎస్ఐ రఫీ, మహిళా పోలీసు ఎస్ఐ భారతి, ఏఎస్ఐ పద్మావతి, ఐసీడీఎస్ అధికారులు మంజునాథ్, కృష్ణమాచారి, చంద్రకళ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: బాలికలు లక్ష్యాన్ని ఎంచుకొని కష్టపడి చదవాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ రోహిణి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బాలికల సంక్షేమ హాస్టల్‌లో బాలికల పరిరక్షణ విభాగం, చైల్డ్ హెల్ప్‌లైన్, ఎంజేపీబీసీ వెల్ఫేర్ సంయుక్తంగా మంగళవారం బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీడీ శ్రీదేవి, సీడీపీఓ భారతి, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి మంజునాథ్, ప్రిన్సిపాల్ సంగీతకుమారి, జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారి, సూపర్‌వైజర్లు సునాలిని, మధుమాలిని, ప్రొటెక్షన్ అధికారి చంద్రకళ, లీగల్ అధికారి సంధ్యారాణి, కౌన్సిలర్‌సంధ్యా, సోషల్ వర్కర్లు వసంతలక్ష్మి, వెంకట్‌కుమార్, చైల్డ్‌హెల్ప్‌లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా బుధవారం నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ అనంతపురం డివిజన్ ఈఈ జేవీ రమేష్ తెలిపారు. ఉదయం 9గంటల నుంచి 11:30గంటల వరకు నగరంలో ప్రభుత్వాస్పత్రి తప్ప మిగిలిన అన్ని చోట్ల విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

రుసుం లేకుండా పన్ను చెల్లించండి

అనంతపురం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): నగర పాలిక పరిధిలో 2024-25 రెండో అర్థ సంవత్సరానికి సంబంధించి ఎలాంటి అపరాధ రుసుము లేకుండా ఇంటి పన్ను తదితర పన్నులు చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు నగర కమిషనర్ నాగరాజు మంగళవారం ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 31లోగా చెల్లించి నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాన్నారు. పన్నుల చెల్లింపునకు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

కన్నులపండువగా కోటి దీపోత్సవం



అన్నాభిషేకానంతరం అనంతేశ్వరస్వామి

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం శారదానగర్‌లోని శివబాల యోగి ఆశ్రమంలో కోటి దీపోత్సవాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం అనంతేశ్వరస్వామికి భక్తుల చేతులమీదుగా అన్నాభిషేకం చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో శివలింగానికి ప్రత్యేక పూజలు చేశారు. వందలమంది భక్తులు పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు దేవరాజు, కార్యదర్శి కలవల మల్లికార్జున పాల్గొన్నారు.



ఆశ్రమంలో దీపాలు వెలగిస్తున్న భక్తులు

శివాలయం జీర్ణోద్ధరణకు నిధులివ్వండి

● దేవదాయశాఖ మంత్రికి నాగసముద్రం గ్రామస్థుల వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే సునీత, ఓబుళేశు

చెన్నేకొత్తపల్లి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగసముద్రం గ్రామంలో వెలసిన అతిపురాతన శివాలయం జీర్ణోద్ధరణకు నిధులు మంజూరు చేయాలని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని ఎమ్మెల్యే పరిటాల సునీత కోరారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు పలువురు గ్రామస్థులతో కలిసి అమరావతి వెళ్లారు. అక్కడ ఎమ్మెల్యే సునీతతో కలిసి వారు మంగళవారం దేవాదాయ శాఖ మంత్రికి వినతిపత్రం అందజేశారు. టీటీడీ నిధుల మంజూరుకు సహకరించాలని కోరగా మంత్రి ఆనం సానుకూలంగా స్పందించారని దండు ఓబుళేశు తెలిపారు.

రేడియాలజీ సెమినార్ రూమ్ ప్రారంభం

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో రేడియాలజీ విభాగానికి ప్రత్యేకంగా సెమినార్ రూమ్ ఏర్పాటు చేశారు. దీనిని మంగళవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపాల్ డాక్టరు మాణిక్యాలరావు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రస్తుతం వైద్యరంగంలో రేడియాలజీకి అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. అలాంటి రేడియాలజీ విభాగ డాక్టర్లు, టెక్నీషియన్లు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రేడియాలజీ విభాగాధిపతి డాక్టరు సురేస్, డాక్టరు మనోరంజన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో కడప ఆర్జేడీ శామ్యూల్ పర్యటన

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి) : పాఠశాల విద్యాశాఖ కడప ఆర్జేడీ శామ్యూల్ జిల్లాలో మంగళవారం పలు ప్రాంతాల్లో విజిట్ చేశారు. నగర శివారులోని సీఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో జరుగుతున్న లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాలను ఆర్జేడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొంతసేపు ప్రధానోపాధ్యాయుల మధ్య కూర్చొని తరగతులను విన్నారు. తర్వాత ఆయన మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలల్లో విద్యార్థులకు, తోటి ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా చూడాలని తెలిపారు. ముఖ్యంగా ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు సాధారణ ఉపాధ్యాయుల మాదిరి కాకుండా నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈఓ క్రిష్ణయ్య, సమగ్రశిక్ష, విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం తర్వాత ఆర్జేడీ పలు పాఠశాలలను తనిఖీ చేశారు.

ఇంకోసారి ఇలాచేస్తే ఇంటికే..!

● టెక్నీషియన్ శ్రీనివాసులుపై డీసీహెచ్ఎస్ ఆగ్రహం

అనంతపురం, టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇంకో సారి ఇలా చేస్తే ఇంటికి పంపించాల్సి వస్తుందని కళ్యాణ దుర్గం సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ శ్రీనివాసులుపై డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్ఆగ్రహం వ్యక్తం చేశారు. టెక్నీషియన్ శ్రీనివాసులు రోగుల బంధువులు నుంచి డబ్బులు దండుకోవడాన్ని ఆధారాలతో సోషల్ మీడియాలో వైరల్‌కాగా... 'పైసలిస్తేనే పని ' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురించిన విషయం తెలిసిందే. దీనిపై డీహెచ్ఎస్ రాష్ట్ర కమిషనర్ శిరి స్పందించారు. తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టెక్నీషియన్ శ్రీనివాసులు మంగళవారం నగరం లోని జిల్లా వైద్య విధాన పరిషత్ కార్యాలయానికి రాగా డీసీహెచ్ఎస్ డాక్టరు రవికుమార్ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకోసారి ఇలాంటి పనులు చేసినట్లు తెలిస్తే ఉద్యోగం నుంచి తొలగిస్తామన్నారు. ప్రస్తుతం క్రమశిక్షణ చర్యలలో భాగంగా కదిరి ఆస్పత్రికి బదిలీచేస్తూ ఉత్తర్వులు జారీజేశారు.

డాక్టర్లు అందుబాటులో ఉండాలి: తహసీల్దార్

శింగనమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో ఉదయం నుంచి రాత్రి వరకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య డాక్టర్లకు సూచించారు. శింగనమల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ తీరుపై మంగళవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన 'మధ్యాహ్నానికే ఖాళీ' అనే కథనంపై మండల అధికారులు స్పందించారు. తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ కార్యాలయం ఏఓ నాగభూషణరెడ్డి, ఎంఈఓ-2 శివప్రసాద్, ఆర్ఐ హనుమాన్ ప్రసాద్ ఆస్పత్రిని తనిఖీ చేశారు. వైద్యుల హాజరు పట్టిక పరిశీలించారు. వైద్యసేవ లపై అక్కడి రోగులతో ఆరాతీశారు. అనంతరం డాక్టర్లు చంద్రకళ, రంగనాయకులు, అంజనేయులుతో ఆస్పత్రిలో డాక్టర్ల డ్యూటీ మెనూ తెలుసుకున్నారు. ఉదయం వచ్చే డాక్టర్లు సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

● జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్

శింగనమల, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియో గం చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి, జిల్లా సివిల్ కోర్టు సీనియర్ న్యాయాధికారి శివ ప్రసాద్ యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని నాగుల గుడ్డం తండాలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా న్యా యాధికారి మాట్లాడుతూ ప్రభుత్వాలు తండా వాసులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకుని పిల్లల భవిష్యత్తుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి రామాంజనేయులు, తహసీల్దార్ సాకే బ్రహ్మయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగభూషణరెడ్డి, సీఐ కౌలుట్లయ్య, ఎంఈఓ శివప్రసాద్, ఈఓపీఆర్డీ వెంకటలక్ష్మి, ఏఓ అన్వేష్‌కుమార్, ఐసీడీఎస్ సుపర్‌వైజర్లు, మండల అధికారులు పాల్గొన్నారు.

పురాతన నాణేల ప్రదర్శన అద్భుతం : జేసీ

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా పురావస్తుశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పురాతన నాణేల ప్రదర్శన అద్భుతమని జాయింట్ కలెక్టర్ శివన్నారాయణ కొనియాడారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పురావస్తుశాఖ, పర్యాటకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం ఆదిమూర్తి నగర్‌లోని జిల్లా పురావస్తు, ప్రదర్శనశాలలో ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, స్టాంపుల ప్రదర్శనను జేసీ ప్రారంభించారు. ప్రదర్శనశాలలో ఏర్పాటు చేసిన పురాతన నాణేలు, స్టాంపులను ఆయన సందర్శించారు. రోటరీ ఇంగ్లీష్ మీడియం స్కూల్, ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు, ఇంటాక్ సభ్యులు, ప్రజలు నాణేల ప్రదర్శనను తిలకించారు. జిల్లా పురావస్తుశాఖ ఏడీ రజిత అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భూపాలం గోవిందరాజులు, అనంతపురం క్లబ్ సహాయ కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, సభ్యులు రామనాథం, రమేష్, గల్లా హర్ష, ఇంటాక్ కన్వీనర్ రామ్‌కుమార్, కోకన్వీనర్ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

అనంతపురం సెంట్రల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి ఉత్సవ్-2024 పోటీల్లో అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. మంగళవారం జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో కేంద్ర యువజన వ్యవహారాలు, నెహ్రూ యువకేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సైన్స్‌మేళాలలో బహుమతులందుకున్నారు. ఎలక్ట్రిక్ అండ్ ఎలక్ట్రానిక్స్ విద్యార్థులు హరీష్, సంజీవగౌడ్, త్రివేణి, హర్షిత, ప్రసన్నాంజలి ప్రథమ బహుమతి, మెకానికల్ విభాగం విద్యార్థులు సాయి జశ్వంత్, శ్రీకృష్ణ ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు. ఆటోమొబైల్ విభాగం విద్యార్థులు క్రిష్ణసాయి, హేమ్‌కుమార్, దేవరాజ్, గణేష్, సతీష్‌కుమార్ తృతీయ బహుమతి పొందగా మరో పదిమంది విద్యార్థులు సర్టిఫికెట్లు అందుకున్నారు. ప్రిన్సిపాల్ జయచంద్రారెడ్డి వారిని అభినందించారు.

ఇందిరాగాంధీ సేవలు మరువలేనివి

గార్లదిన్నె/చెన్నేకొత్తపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని ఇందిరా గాంధీ దేశానికి చేసిన సేవలు మరువ లేనివని ఎంపీపీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు తిలో త్తమ పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక గ్రంథాలయంలో మంగళవారం ఝాన్సీ లక్ష్మీబాయి, ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని మహిళా దినత్సోవం నిర్వహించారు. అలాగే చెన్నేకొత్తపల్లి మండలంలోని మేడాపురం శాఖ గ్రంథాలయంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు.

సాయి ట్రస్టు సేవలు అభినందనీయం

అనంతపురం కల్చరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సాయి ట్రస్టు సేవలు అభినందనీయమని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో మంగళవారం జేఎన్‌టీయూ ఆడిటోరి యంలో నిర్వహించిన జిల్లా యువ ఉత్సవ్ కార్యక్రమంలో భాగంగా సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్‌కు కలెక్టర్ వినోద్ కుమార్, జేఎన్‌టీయూ ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, వీసీ సుదర్శన్, నెహ్రూ యువకేంద్ర కోఆర్డినేటర్ మణికంఠ చేతులమీదుగా మొమెంటో అందజేసి సత్కరించారు.

ఉపాధి పనుల పరిశీలన

నార్పల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నార్పల, బొందలవాడ, సిద్ధిరాచర్ల గ్రామాల్లో మంగళవారం పీడీ సలీంబాషా ఉపాధి పనులను పరిశీలించారు. మొదట బొందలవాడ, సిద్ధిరాచర్ల గ్రామాల్లో ఉపాధి పథకం కింద చేపట్టిన ఫారం పాండ్లను పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. అలాగే నవంబరు ఈనెల 30లోపు పశువుల షెడ్లు నిర్మాణాలు పూర్తయ్యేలా చూడాలని సూచించారు. ఎంపీడీఓ గంగావతి, ఏపీఓ రమేష్ రామరావ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా భాష్యం ప్రీమియర్ లీగ్

అనంతపురం విద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి) : భాష్యం విద్యాసంస్థల ప్రీమియర్ క్రికెట్ లీగ్ టోర్నమెంట్ సందడిగా సాగింది. పీటీసీ గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించారు. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ మల్లికార్జున, స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ సెక్రెటరీ సుగుణ ముఖ్యఅతిథులుగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. విజేతల కు ట్రోఫీ, పతకాలు అందించారు. చైర్మన్ రామ కృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు, రాయలసీమ జోన్ జెడ్ఈఓ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులో మంగళవారం ఎదురెదురుగా బైక్‌లు ఢీ కొని ఇద్దరు గాయపడ్డారు. గార్లదిన్నెకు చెందిన మధు, నాగరాజు ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్తుండగా ఎస్కేడీ కళాశాల వద్ద ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొంది. స్వల్పంగా గాయపడిన మధు, నాగరాజును ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లాకు పతకాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారులకు పతకాలు దక్కాయి. ప్రకాశం జిల్లాలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి 38వ ఏపీ తైక్వాండో చాంపియన్‌షిప్-2024 పోటీల్లో జిల్లాకు చెందిన ఎండీ తైక్వాండో అకాడమీ క్రీడాకారులు సాయి తన్వి, హేమశ్రీ కాంస్య పతకాలు సాధించారు. విజేతలను, కోచ్ జూటూరు మునీంద్రను జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గురుస్వామి మంగళవారం అభినందించారు.

ల్యాబ్ టెక్నీషియన్ల ఔదార్యం

అనంతపురం టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ల్యాబ్ టెక్నీషియన్లు తమ తోటి టెక్నీషియన్ పట్ల ఔదార్యం చూపారు. జిల్లా కేంద్రంలోని శ్రేయ ఆస్పత్రిలో పనిచేస్తున్న ప్రదీప్ అనే ల్యాబ్ టెక్నీషియన్ ఇటీవల ప్రమాదంలో గాయప డ్డారు. ఆయన ఆసుపత్రిలో చికిత్సలు పొంది కోలుకుని ఇంటికి చేరుకున్నారు. నగరంలోని తోటి టెక్నీషియన్లు మంగళవారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబంపోషణకు తమ వంతు సాయంగా రూ.60 వేలు అందించి తమదాతృత్వం చాటుకున్నారు.

స్వామికి వెండి శఠగోపం

గార్లదిన్నె, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని కోటంక గుంటి కింద సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అనంతపురానికి చెందిన భక్తులు వెండి శఠగోపం సమర్పించారు. అనంతపురానికి చెందిన మోదు పల్లి రామేశ్వరమ్మ, కవిత కుటుంబ సభ్యులు మంగళవారం 69 తులాల నాలుగు గ్రాములున్న రూ.72,400 విలువగల శఠగోపం, వెండిహారతిని అర్చకులు రాము ఆచార్యులుకు అందజేశారు.

రక్తదానం సామాజిక బాధ్యత: డీసీఓ

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): రక్తదానం ప్రతిఒక్కరి సామాజిక బాధ్యత అని జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి పేర్కొన్నారు. స్థానిక సుభాష్‌రోడ్డులో ఉన్న శ్రీకృష్ణదేవరాయభవన్ అర్బన్ బ్యాంకులో మంగళవారం 71వ అఖిల భారత సహకార వారోత్స వాలలో భాగంగా చైర్మన్ జేఎల్ మురళీధర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీఓ అరుణకుమారి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. త్వర లో రాష్ట్ర వ్యవసాయ, సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో జిల్లాలో రాష్ట్ర స్థాయి సహకార సభ నిర్వహించనున్న ట్లు తెలిపారు. అనంతరం క్రికెట్ పోటీల విజేతలకు, రక్తదానం చేసిన యువతకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఆర్‌సీటీసీ ప్రిన్సిపా ల్ శ్రీనివాసులు, సహకార విద్యాశాఖాధికారి మురళీమోహన్, బ్యాంకు సీఈఓ విజయ భాస్కర్, వైస్ చైర్మన్ వెంకటాద్రి, పాలకవర్గ సభ్యులు కృష్ణకుమార్, చింతా భాస్కర్, రొళ్ల భాస్కర్, రమణయ్య, మేనేజర్లు, ఖాతాదారులు సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

ఇందిరా గాంధీకి ఘన నివాళి


ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుంతకల్లుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దౌల్తాపురం ప్రభాకర్ ఇందిరా గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అనురాగ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి


శోభాయాత్రలో పాల్గొన్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థినులు

గుంతకల్లుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఏబీవీపీ ఆధ్వర్యంలో వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. స్థానిక శస్త్ర కళాశాల నుంచి విద్యార్థినులతో శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టూటౌన్ సీఐ మస్తాన్ హాజరై శోభాయాత్రను ప్రారంభించారు. శోభాయాత్ర ఎన్టీఆర్ సర్కిల్ వరకు కొనసాగింది. ఏబీవీపీ బాగ్ కన్వీనర్ శివరాజ్, నగరకార్యదర్శి వంశీ, కళ్యాణ్, రవితేజ, బన్నీ, మన్సూర్, మహేంద్ర, రఘు పాల్గొన్నారు.

వనభోజనాలు


పూజల్లో పాల్గొన్న నగర ఉత్సవ సమితి సభ్యులు

గుంతకల్లుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో వెలసిన వివేకానంద పంచపల్లవ ఉద్యానవనంలో మంగళవారం నగర ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వనభోజనాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉదయం శివుడికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామం కల్లుహోలే మఠం సంస్థానాధీశులు చన్నవీర శివాచార్య మహాస్వాములు హాజరై ఆశీర్వాద ప్రసంగం చేశారు. మధ్యాహ్నం ఉసిరి చెట్టు కింద భోజనం చేశారు. నగర ఉత్సవ సమితి అధ్యక్షుడు బండారు కృష్ణమూర్తి, గౌరవఅధ్యక్షుడు డాక్టర్ కాకర్ల ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గోపాజగదీష్, కార్యదర్శి ఇల్లూరు సోమనాథ్, కోశాధికారి ఇల్లూరు లక్ష్మీనారాయణ, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గౌరీదేవి జలధి


అమ్మవారిని జలధికి తరలిస్తున్న భక్తులు

బ్రహ్మసముద్రం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పోలేపల్లి గ్రామంలో గౌరీదేవి ప్రతిమను రెండు రోజులు ప్రతిష్ఠించి విశేష పూజలు నిర్వహించారు. వివిధ రకాల పూలతో అమ్మవారికి ప్రత్యేక పుష్పాలంకరణ చేశారు. అనంతరం అమ్మవారి ప్రతిమను పల్లకిలో వుంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మంగళవారం అమ్మవారిని జలధికి పంపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కడ్లేగౌరమ్మకు చక్కెర హారతులు


ఆలయం వద్ద చక్కెర హారతులతో మహిళలు

బొమ్మనహాళ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామంలో కడ్లేగౌరమ్మ వేడుకల్లో భాగంగా మంగవారం రాత్రి చక్కెర హారతుల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బాలికలు, యువతులు, మహిళలు చక్కెర హారతులతో ఆలయానికి చేరుకుని అమ్మవారికి పూజలు నిర్వహించి చక్కెర హారతులు పట్టారు. బుధవారం ఉదయం అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేయనున్నారు.

శెట్టూరు: మండలపరిధిలోని బసంపల్లి గ్రామంలో వెలసిన మారెమ్మ దేవాలయంలో కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి వివిధ పుష్పాలంకరణ, కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మహామంగళహారతి ఇచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

రోగులకు మౌలిక వసతులు కల్పించండి

● మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్


డాక్టర్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీపీఆర్

తాడిపత్రి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రికి వచ్చే రోగులకు మౌలిక వసతులు కల్పించాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ప్రస్తుతం రూ.24కోట్లతో భవనం కట్టి వాటికి మౌలిక సదుపాయాలు లేక అసంపూర్ణంగా మిగిలిపోవడంతో డాక్టర్లు, రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈవిషయాన్ని ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిల దృష్టికి తీసుకువెళ్లగా ఆసుపత్రిని బాగుచేయాలంటే ప్రస్తుతం నిధులు లేకపోయినా సొంత నిధులతో ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం వాటి ఖర్చు భారీగా అవుతుందని అంచనా వేశారు. మున్సిపల్ చైర్మన్ తన సొంత ఖర్చులు రూ.50లక్షలు ప్రకటించారు. ఈ డబ్బులను కాంట్రాక్టర్ విడతలవారీగా తీసుకొని వాటికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని ఆయనకు హామీ ఇచ్చారు. జనవరికల్లా పూర్తిగా ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఇక్కడి నుంచి అనంతపురానికి వెళ్లకుండా ప్రతి కేసును చూడాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు చేపట్టండి: టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు త్వరగా ఇళ్ల నిర్మాణాలు చేసుకొనే విధంగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ అధికారులు, టిడ్కో ఇళ్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇళ్ల నిర్మాణాలు ఆలస్యం అవుతున్నాయని వాటికి కారణాలు తెలపాలన్నారు. ఇళ్ల మంజూరై ఎక్కువరోజులు కట్టుకోకుంటే కొంత టైం ఇచ్చి వాటిని పూర్తి చేసే విధంగా చూడాలని, లేనిపక్షంలో వాటిని పరిశీలించి రద్దుచేసే విషయాన్ని పరిశీలించాలన్నారు. పేదల ఇళ్లను ఆక్రమించి అమ్ముకున్న వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. త్వరలో టిడ్కో ఇళ్లను అధికారులతో కలిసి పరిశీలిస్తామన్నారు. డీడీలు కట్టి ఇళ్లు రాని వారుంటే మున్సిపాలిటీలోని చైర్మన్ చాంబర్‌లో అర్జీలు ఇవ్వవచ్చు అన్నారు. కడపరోడ్డులో 405 మంది బీడీకార్మికులకు ఇచ్చిన స్థలాలల్లో ఇళ్లను కట్టించేందుకు హౌసింగ్ అధికారులు పరిశీలించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ శివరామకృష్ణ, తహసీల్దార్ రజాక్‌వలి, టిడ్కో ఈఈ సుధారాణి, డీఈ షబానా, హౌసింగ్ డీఈ షెక్షావలి, ఏఈ రాజశేఖర్ పాల్గొన్నారు.

బ్రిడ్జి పరిశీలన

డి.హీరేహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శిథిలావస్థకు చేరుకున్న బ్రిడ్జిలను ఆర్‌అండ్‌బీ అధికారులు మంగళవారం పరిశీలించారు. సోమలాపురం నుంచి చెర్లోపల్లి, నాగలాపురం, బొమ్మనహాళ్ మండల ప్రజలు ప్రతి రోజూ బ్రిడ్జి మీదుగా వాహనాలపై రాకపోకలు కొనసాగిస్తూ ఉంటారని, బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకోవడంతో సమస్యను ఆయా గ్రామాల ప్రజలు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణ పనులు వెంటనే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రోడ్లు భవనాలశాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇతర అధికారులు మంగళవారం సోమలాపురం గ్రామానికి వచ్చారు. మండల కన్వీనర్ హనుమంతరెడ్డితో కలిసి బ్రిడ్జిని పరిశీలించారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు కూడా తయారు చేసి వెంటనే ఉన్నతాధికారులకు పంపించి పనులు త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. ఎంపీటీసీ మల్లికార్జున, నాగరాజు, శంకర్, భీమలింగ పాల్గొన్నారు.

క్రమ శిక్షణతో విద్యను అభ్యసించాలి

గుత్తి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత స్థాయిలో రాణించాలని మున్సిపల్ కమిషనర్ జబ్బర్‌మీయా సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహంలో ఆయన విద్యార్థులకు ప్రభుత్వం తరఫున మంజూరైన దుప్పట్ల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. 60మంది విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. హాస్టల్ వార్డెన్ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఇంటెలిజెన్స్ ఎస్పీని కలిసిన పత్తి హిమబిందు

గుంతకల్లుటౌన్,నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఝాన్సీలక్ష్మీబాయి జయంతిని పురస్కరించుకుని విజయవాడలో ఏపీ ఇంటెలిజెన్స్ ఎస్పీ సరితను మంగళవారం ఇంపాక్ట్ క్లబ్ పట్టణ అధ్యక్షురాలు డాక్టర్ పత్తి హిమబిందు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ సరితకు శాలువ వేసి హిమబిందు సత్కరించారు.

క్రైం కార్నర్

ఆర్‌బీ వంకలో ఆవుల అపహరణ

రాయదుర్గం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆర్‌బీవంక గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు పశువులను అపహరించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మూడురోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ఏడుపశువులను అపహరించుకొని వెళ్లినట్లు రైతులు కిష్టయ్య, ఆంజనేయులు, హరిచంద్ర నాయక్ తెలిపారు. గ్రామంలో తమ ఆవులను, గేదెలను పాకలో కట్టేసి ఉంచామని, ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఏడు ఆవులను ఎత్తుకెళ్లినట్లు వారు తెలిపారు. వీటి విలువ రూ.2.5 లక్షలు ఉంటుందని బాధితులు తెలిపారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు కూడా చేసినట్లు వారు తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

గుత్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు గాయపడ్డారు. పట్టణ శివారులో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొన్న ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గార్లదిన్నెకు చెందిన మధు, నాగరాజు తమ ద్విచక్రవాహనంలో గుంతకల్లుకు వెళ్తుండగా ఎస్కేడీ కళాశాల సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొంది. దీంతో మధు, నాగరాజు స్వల్పంగా గాయపడగా వారిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుత్తిరూరల్: మండలంలోని శ్రీపురం గ్రామాశివారు 67వ జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. శ్రీపురం గ్రామానికి చెందిన ఓబులేసు, గిడ్డయ్య బైకుపై గుత్తికి వస్తుండగా గ్రామాశివారులోకి రాగానే బైకును వెనుక నుంచి లారీ ఢీకొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేప్పట్టారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామసమీపంలో మంగళవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌చేసినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పెన్నానది నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారంతో సిబ్బందితో కలిసి దాడులు చేశామన్నారు. దాడుల్లో ట్రాక్టర్లను సీజ్‌చేసి స్టేషన్‌కు తరలించామన్నారు. ట్రాక్టర్ల యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.

నాటుసారా పట్టివేత

తాడిపత్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె సమీపంలో ఆలూరు నుంచి తాడిపత్రికి వస్తున్న వీరన్నను అరెస్ట్‌చేసి అతనివద్ద నుంచి 10 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని సీఐ నాయుడు తెలిపారు. అందిన సమాచారం మేరకు ఆలూరు గ్రామానికి చెందిన వీరన్న ఆలూరు నుంచి సజ్జలదిన్నెవైపు వస్తుండగా దాడిచేసి సారాను స్వాధీనం చేసుకొని వీరన్నను అరెస్ట్‌చేశామని తెలిపారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తుల అరెస్టు

కుందుర్పి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొలిమిపాలెం చెక్‌పోస్టు వద్ద మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ శాఖ పోలీసులు అరెస్టు చేశారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేస్తుండగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించగా కర్ణాటక ప్రాంతం నుంచి జంబుగుంపల, కుందుర్పి గ్రామాలకు చెందిన శివప్ప, బసవరాజులను అదుపులోకి తీసుకుని రెండు ద్విచక్ర వాహనాలతో పాటు 288 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు తెలిపారు. ఎక్సైజ్ ఎస్‌ఐ నరేష్, హెడ్ కానిస్టేబుల్ రాజు సిబ్బంది పాల్గొన్నారు.

బలిజ సంఘం నాయకుడిపై కేసు నమోదు

తాడిపత్రి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బలిజ సంఘం ఆధ్వర్యంలో విరాళాలతో కల్యాణ మండపాన్ని నిర్మించారు. కల్లూరు శ్రీనివాసులు బలిజ సంఘం అధ్యక్షులుగా ఉంటూ కల్యాణ మండపం బాధ్యతలు నిర్వర్తించేవాడు. ప్రస్తుతం కల్యాణ మండపానికి సంబంధించి రికార్డులను సరిగా చూపించకపోగా, పిలిస్తే రావడం లేదని అతనిపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఆ సంఘం నాయకులు మాసుల ప్రసాద్ తోపాటు కొంతమంది ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు అతనిపై కేసు నమోదుచేస్తామని ఏఎస్‌ఐ హనుమంతు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

యాడికి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడిన చెండ్రాయుడు (37) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన మేరకు సత్యసాయి జిల్లా ధర్మవారినికి చెందిన చెండ్రాయుడు అనంతపురం జిల్లా యాడికి మండలంలోని రాయలచెరువులో టీహోటల్‌లో పనిచేస్తున్నట్లు తెలిపారు. చెండ్రాయుడు అయ్యప్పస్వామి మాల ధరించాడు. 14వ తేదీన అయ్యప్పస్వామి ఆలయానికి నడుచుకుంటూ వెళుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో చెండ్రాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం ఆయనను కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఆయన మృతిచెందినట్లు తెలిపారు. చెండ్రాయుడు భార్య రత్నమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

187 మంది ఉద్యోగాలకు ఎంపిక

గుంతకల్లుటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్కేపీ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం జాబ్ మేళాను నిర్వహించారు. 11 కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొన్నారు. 240 మంది నిరుద్యోగులు పాల్గొనగా 187 మంది ఎంపికయ్యారు. 46 మంది తరుపరి ఇంటర్వ్యూకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ఆయన అభినందించారు. జిల్లా నైపుణ్యాధికారి మహేష్, సీడాప్ జేడీఎం నారాయణస్వామి, జేకేసీ కోఆర్డినేటర్ ఆర్ నాగరాజు, కళాశాల, స్కిల్ డెవలప్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

దర్గాలో దీపారాధన


దర్గాలో ప్రార్థనలు చేస్తున్న షకీల్ షఫి

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరు గ్రామంలో వెలసిన సయ్యద్ సర్మాస్ వలి చిష్టీ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మొదటి దీపారాధన భక్తిశక్తిలతో నిర్వహించారు. స్వామివారి సమాధిని నూతన వస్త్రం, పుష్పాలతో అలంకరించి దర్గా పీఠాధిపతి ముతవల్లి సయ్యద్ షా రహంతుల్లా ప్రార్థనలు చేసి దీపారాధన చేపట్టారు. ముతవల్లిల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షకీల్ షఫీ దర్గాలో ప్రార్థనలు చేశారు. టీడీపీ బీసీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కేశప్ప, అర్గనైజింగ్ సెక్రటరీ నాగరాజు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

రాయదుర్గంటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘం పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు టంకశాల హనుమంతు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డిని కోరారు. పురపాలక సంఘం పరిధిలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులపై హనుమంతు, మాజీ వైస్ చైర్మన్లు నల్లపూల వెంకటేశులు, కడ్డిపుడి మహబూబ్ బాషా, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ పొరాళ్ల పురుషోత్తం చర్చించారు. పట్టణంలో చేపడుతున్న రహదారుల మరమ్మతు పనులు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు.

జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు

బొమ్మనహాళ్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహొన్నూరులో టీడీపీ నాయకులు పార్టీ సభ్యత్వం కార్యక్రమం జోరుగా సాగుతుంది. మంగళవారం మాజీ సర్పంచ్ కేశప్ప, నాయకులు అనంద్, మహమ్మద్ రఫీ సభ్యత్వం నమోదు చేయించారు. కేపీ వన్నూరుస్వామి, నాగరాజు, రఫీ, రామంజనేయులు పాల్గొన్నారు.

రూ.25 వేల ఆర్థిక సాయం

తాడిపత్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక రోటరీ క్లబ్ కార్యాలయ ఆవరణలో మంగళవారం యాడికి మండలం నిట్టూరు గ్రామానికి చెందిన ఐఐటీ విద్యార్థి ప్రవీణ్ విద్య కోసం రోటరీట్రస్ట్ తరఫున రూ.25వేలు ఆర్థిక సాయం అందించినట్లు అధ్యక్షుడు సంజన్న తెలిపారు. నాగపూర్ ఐఐటీలో చదువుతున్న ప్రవీణ్ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడన్న విషయం తెలుసుకొని విద్యార్థి తల్లి రాజేశ్వరికి నగదును అందజేశామన్నారు. కార్యదర్శి అనిల్‌కుమార్, కోశాధికారి బాలసుబ్రహ్మణ్యం, బాబు, రామసుబ్బారెడ్డి, ఇస్మాయిల్, మద్దిలేటి, మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కణేకల్లు చెరువుకు చిన్నపాటి రంధ్రాలు

● యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

కణేకల్లు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కణేకల్లు శ్రీచిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు మూడు చోట్ల చిన్నపాటి రంధ్రాలు పడడంతో సకాలంలో స్పందించిన అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేసి నీటి లీకేజీని అరికట్టారు. గంగలాపురంకు వెళ్లే దారిలో నాగలకట్ట సమీపంలో ఉన్న మూడో తూము వద్ద చెరువుకు మూడుచోట్ల చిన్నపాటి రంధ్రాలు పడి నీరు వృథాగా భూముల్లోకి వెళుతున్నాయి. ఇప్పటికే మాగాణి భూములు కోత దశకు రాగా ఇటీవలే ఆ నీటిని కూడా భూములకు బంద్ చేయించారు. ఇలాంటి పరిస్థితుల్లో రంధ్రాల ద్వారా నీరంతా పొలాలలోకి పోతుండడంతో గమనించిన రైతులు హెచ్చెల్సీ అధికారులకు సమాచారం అందించారు. డీఈ మద్దిలేటి ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బంది, టీడీపీ నాయకులు హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌తో రప్పించి రంధ్రాలు పడిన ప్రాంతాన్ని గుర్తించారు. అనంతరం వాటికి మట్టిని వేసి నీటి లీకేజీని అరికట్టారు. టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా, కురుబ నాగరాజు, మాబుసాబ్, చాంద్‌బాషా, తిప్పేస్వామి, నజీర్ పాల్గొన్నారు.


పనులను పర్యవేక్షిస్తున్న టీడీపీ నాయకులు

రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ ఎల్‌ఓసీ మంజూరు



ఆదిశేషు కుటుంబ సభ్యుడికి ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే జయరాం

గుంతకల్లు, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఓ రోగి ఆపరేషన్ కోసం ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం రూ.10 లక్షల సీఎంఆర్‌ఎఫ్ లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌ఓసీ)ను మంజూరు చేయించారు. గుంతకల్లులోని పోర్టర్స్‌లైన్ ప్రాంతానికి చెందిన బంగ్లా ఆదిశేషు అనే వ్యక్తికి లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాల్సిన పరిస్థితులేర్పడటంతో ఎమ్మెల్యేను ఆశ్రయించారు. రోగి పరిస్థితిని ఎమ్మెల్యే ప్రభుత్వం, సీఎంఆర్‌ఎఫ్ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించారు. ఆపరేషన్‌కు అయ్యే ఖర్చులో రూ.10 లక్షల వరకూ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి అందించడానికి నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు హైదరాబాదు, జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ పేరిట రూ.10 లక్షల నిధిని ఇవ్వడానికి ఆమోదం తెలుపుతూ సీఎంఆర్‌ఎఫ్ సహాయ కార్యదర్శి ఎన్ లక్ష్మీ పద్మజ లెటర్ ఆఫ్ క్రెడిట్‌ను జారీచేశారు. ఆపరేషన్ పూర్తయిన తర్వాత ఆసుపత్రి బిల్లులను పొందుపరచిన వెంటనే రూ.10 లక్షలను విడుదలచేసేలా ఎల్‌ఓసీని ఎమ్మెల్యే జయరాంకు ఇవ్వగా, ఆయన మంగళవారం బాధిత కుటుంబ సభ్యుడికి విజయవాడలో అందజేశారు.

ఆస్పత్రిలో అన్ని సేవలు ఉచితమే...!

● ఆస్పత్రి గోడపై అంటించిన అధికారులు
● ఔట్‌సోర్సింగ్ టెక్నీషియన్ కదిరికి బదిలీ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ప్రభుత్వాస్పత్రిలో గోడపై అంటించిన అధికారులు

కళ్యాణదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం పీహెచ్‌సీలో ఇక్కడ అన్నీ ఉచితమే, డబ్బులు తీసుకోబడవు అంటూ గోడపై రాతలు వెలిశాయి. ఇటీవల ఆంధ్రజ్యోతిలో పైసలిస్తేనే పని, డబ్బులిస్తేనే వైద్యం అని ప్రత్యేక కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ కథనాలకు స్పందించిన జిల్లా వైద్యశాఖాధికారులు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్ శ్రీనివాసులును కదిరి సీహెచ్‌సీకి డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. ఓపీ, రక్త పరీక్షల వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన భవనంలోనూ, ఆస్పత్రిలోను అన్ని సేవలు ఉచితమే అని, ఎవరైనా డబ్బులు అడిగితే వైద్యాధికారిని సంప్రదించండి అని గోడపై అంటించారు. దీంతో కిందిస్థాయి సిబ్బందిలో కలకలం రేపుతోంది. వైద్యాధికారి కూడా ఇక డబ్బులు తీసుకున్నట్లు తమ దృష్టికి వస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భూముల పరిశీలన

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు గ్రామ శివారులో ఫ్యాక్టరీల యాజమాన్యులు ఇటీవల 35 ఎకరాల భూములను కొనుగోలు చేశాయి. ఆ భూములను మంగళవారం కళ్యాణదుర్గం ఆర్డీఓ వసంతబాబు పరిశీలించారు. భూములను ఇటీవల ఫ్యాక్టరీ యాజమాన్యం కన్వర్షన్ చేయాలని కోరింది. దీంతో ఆ భూముల స్థితిగతులను తెలుసుకునేందుకు ఆర్డీఓ భూములను పరిశీలించి, అందుకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.